ప్రభాత సమాచారం
https: epaper.
prabhathasamacharam.com
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
■ బుధవారం | 2 ఏప్రిల్ 2025 | ■ 12 పేజీలు




■ మొక్కజొన్న రైతులను దగా చేస్తున్న దళారులు ■ కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో తీవ్ర జాప్యం
■ తొలిదశ అమ్ముకున్న రైతులు ■ ధరను తగ్గిస్తున్న వ్యాపారులు
■ మొన్నటి వరకు క్వింటాల్‌కు రూ.2600లకు కొనుగోళ్లు
■ ముథోల్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో తిష్ట వేసిన నిజామాబాద్ జిల్లా వ్యాపారులు
■ ప్రస్తుతం రూ.2వేలు కూడా రావడం లేదని ఆవేదన
■ అకాల వర్షాలు, అధికారుల నిర్లక్ష్యంతో అన్నదాతలకు తప్పని నష్టాలు

ఆష్టా గ్రామంలో కల్లాల వద్దే రైతులతో 'మక్క' దళారుల బేరసారాలు

# మొక్కజొన్న కొనుగోళ్లలో దళారుల దందా

నిర్మల్ జిల్లాలో మొక్కజొన్న కర్షకుల కష్టం దళారుల పాలవుతోంది. ఈ సారి మొక్కజొన్న దిగుబడులు బాగా వచ్చాయని ఆనందంగా మురిసిపోయిన మొక్కజొన్న రైతు దిగుబడులను మార్కెట్‌లోకి తీసుకువచ్చే సరికి దళారులు అమాంతంగా ధరను తగ్గించడంతో రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. మొదట్లో క్వింటాల్‌కు రూ.2600ల వరకు కొనుగోలు చేసిన మక్క ధరను ప్రస్తుతం దళారులు, ప్రైవేట్ వ్యక్తులు 2వేలకు కూడా కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వపరంగా ఇంకా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో ఇదే అదునుగా చూసి ప్రైవేట్ వ్యక్తులు, దళారులు సిండికేట్‌గా మారి ధరను తగ్గించేశారని మక్క రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ వ్యాపారులు ముథోల్ నియోజకవర్గంలోని పలు గ్రామాలకు వచ్చి నేరుగా రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల ఆష్టా గ్రామంలో ఓ వ్యాపారి తూకంలో మోసం చేయడంతో అది గ్రహించిన రైతులు సదరు వ్యాపారితో ఘర్షణకు దిగారు. గత రెండు సంవత్సరాలుగా మొక్కజొన్నకు బహిరంగ మార్కెట్‌లో మంచి ధర లభిస్తుండడంతో ఈ సారి రైతులు భారీగా పంట సాగు చేశారు.

- ప్రభాత సమాచారం, ముథోల్

---

## బెట్టింగ్ యాప్‌లపై.. ఉక్కుపాదం

జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా ఏర్పాటు
అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు
బెట్టింగ్ కేసులో ఇద్దరు యువకుల అరెస్టు
ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడి

06

Steel on betting apps



యువత, విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్, నిషేధిత ప్లే కార్డ్స్ గేమింగ్ యాప్‌లకు, ఐపీఎల్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. బెట్టింగ్ కేసులో ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. మంగళవారం ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. ఎస్సై అశోక్, సిబ్బంది కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, పట్టణంలోని డైట్ మైదానంలో ఆన్‌లైన్‌లో బెట్టింగ్ ఆడుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు.

## సన్న బియ్యం పంపిణీ చరిత్రలో.. నిలిచిపోయే పథకం

ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

12





## సన్నబువ్వ.. సంబురం

### ఊరూరా ప్రారంభమైన సన్నబియ్యం పంపిణీ

సన్న బియ్యం సంబురాలు తెచ్చింది. పేదల పొయ్యిపై సన్నబువ్వ ఉడుకుతోంది. ప్రజాప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన సన్నబియ్యం పంపిణీ పథకం మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఊరూరా మొదలైంది. కలెక్టర్లు, ఎమ్మెల్యేలు ప్రారంభించి పేదలకు సన్నబియ్యం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేదోళ్ల ప్రభుత్వమని, వారి అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందన్నారు. సన్న బియ్యం పంపిణీతో పేదల కుటుంబాలలో ఆనందం నింపాలనే సదుద్దేశంతో పథకం ప్రారంభించామన్నారు.

## పాదరక్షలు లేకుండా

### మండుటెండలో పాదయాత్ర

పౌరాదేవి దర్శనానికి బయలుదేరిన సేవాలాల్ మహరాజ్ భక్తులు
దాదాపు 200 వందల పైచిలుకు కిలోమీటర్లు కాలినడకన..
బంజారా కుంభమేళాగా అభివర్ణించే పౌరాదేవి జాతర

To Banjara Kumbh Mela

సేవాలాల్ దీక్షలు చేపట్టిన బంజారా భక్తులు దీక్షభూమి కొత్తపల్లి నుండి మహా కుంభమేళ పౌరాదేవికి దర్శనానికి దాదాపు రెండు వందల పైచిలుకు కిలోమీటర్లు కాలినడకన బయలు దేరారు. జగజ్జననిగా పిలువబడే అమ్మ జగదాంబదేవి ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ యొక్క దర్శనం కోసం భక్తులు దీక్ష గురుప్రేమ్ సింగ్ మహరాజ్ నేతృత్వంలో ఉగాది రోజున పాదయాత్రను ప్రారంభించి అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన బంజారాల కాశీ పౌరాగడ్‌కు పాదరక్షలు లేకుండా చేరుకుంటారు. శ్రీరామనవమి రోజున మహా పూజ భోగ్ భండారో కార్యక్రమాల్లో పాల్గొంటారు.బంజారా కుంభమేళాగా అభివర్ణించే పౌరాదేవి జాతర తొమ్మిది రోజుల పాటు ఘనంగా జరుగనుంది.

12





# సన్నబియ్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

ప్రజాపాలన ప్రభుత్వంలో ప్రజలందరూ కూడా ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టిందని ఈ సన్నబియ్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కాలనీలో 32వ షాప్ నంబర్‌లో సన్నబియ్యం కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అర్హులైన ప్రజలందరికీ సన్న బియ్యం పంపిణీ చేయాలన్న ఉద్దేశంతో ప్రజా పంపిణీ ద్వారా ఇకపై ప్రతి నెల దొడ్డు బియ్యం కు బదులుగా సన్నబియ్యం అందజేయడం జరుగుతుందని అన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నిర్ణయాన్ని తీసుకున్నారని తెలిపారు. సన్న బియ్యంతో పాటు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కోరారు. అటు మావలలో సన్న బియ్యం పంపిణీ నీ మావల మండల అధ్యక్షుడు ధర్మపురి శేఖర్ ఆధ్వర్యంలో షాప్ నెంబర్ 7 లో ప్రారంభం చేయగా రేషన్ కార్డు లబ్ధిదారులు సన్న బియ్యం పంపిణీ పై హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తామని కేవలం హామీలతో సరిపెట్టిందని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రజలకు సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తుందని మండల అధ్యక్షుడు పేర్కొన్నారు. ఇందులో ఆ అధికారులు ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## డీఈఓ ప్రణీతకు ఆత్మీయ వీడ్కోలు



**ఆదిలాబాద్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

పదవీ విరమణ పొందిన జిల్లా విద్యాశాఖ అధికారిణి ప్రణీతకు ఆత్మీయ సన్మాన కార్యమ్రాన్ని మంగళవారం ఏర్పాటు చేసిన పదవీ విరమణ సన్మాన సభలో అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీఓ వినోద్ కుమార్, నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, జనగామ జిల్లా విద్యాశాఖాధికారి ఏడి దర్శనం భోజన్న, మాజీ బోద్ శాసనసభ్యులు రాథోడ్ బాపురావు, జిల్లా అధికారులు ఎస్సీ సంక్షేమ అధికారిణి సునీత డీపీఆర్ఓ తిరుమల, ఐసిడిఎస్ అధికారిని మిల్కా జిల్లాలోని ఎంఈఓ లు ప్రధానోపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ రాజర్షి షా క్యాంప్ కార్యాలయంలో విద్యాశాఖ అధికారిణి ప్రణితను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ ప్రతీ ఉద్యోగికి తప్పనిసరి అని గత మూడున్నర సంవత్సరాలుగా విద్యాశాఖలో సేవలందించి అందరి మన్ననలను పొందారని, వారి సేవలు చిరస్మరణీయం అని కొనియాడారు. అనంతరం సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు వారి అనుభవాలను పంచుకున్నారు. శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు.

## ఆరోగ్య పాఠశాల బృందానికి సన్మానం

**ఆదిలాబాద్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లాలో కలెక్టర్ రాజర్షి షా వైవిధ్య ఆలోచన రూపమైన ఆరోగ్య పాఠశాల ప్రత్యేక కార్యక్రమానికి ప్రతిష్టాత్మకమైన జాతీయ స్థాయి స్కోచ్ అవార్డ్ దక్కింది. ఈ సందర్భంలో ఆ నందాన్ని వ్యక్తపరుస్తూ ఆరోగ్య పాఠశాల కార్యక్రమానికి అవార్డు వచ్చేలా పనిచేసిన డిఈఓ ప్రణీత ఆరోగ్య పాఠశాల జిల్లా సంధాన కర్త అజయ్ జిల్లా వైద్యాధికారి నరేంద్ర రాథోడ్ డాక్టర్ వంశీ డాక్టర్ శ్రీధర్, అదేవిధంగా మిల్కా జిల్లా సంక్షేమ అధికారి అంతే కాకుండా రిసోర్స్ పర్సన్‌గా పనిచేసిన ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు అశోక్, ప్రత్యూష సత్యనారాయణ పోచరెడ్డి, సిల్వేరి రాములు, వేణు, ప్రతాప్,



రాహుల్ రాథోడ్‌లకు గౌరవ కలెక్టర్ సన్మానం చేశారు. ఇంతే ఉత్సాహంతో ఆరోగ్య పాఠశాల కార్యక్రమాన్ని 2025 26 విద్యా సంవత్సరంలో జూలై మాసం నుండి డిసెంబర్ వరకు కూడా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు.

## రేషన్ బియ్యాన్ని దళారులకు విక్రయించవద్దు



**నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

సన్న బియ్యం పంపిణీ ద్వారా పేదలకు మరింత లాభం చేకూరుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం నిర్మల్ పట్టణంలోని ఆదర్శనగర్ రేషన్ దుకాణంలో జిల్లా కలెక్టర్ పేద ప్రజలకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి నిరుపేదకు లాభం చేకూర్చే విధంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని అన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే ఫోర్టిఫైడ్ రేషన్ బియ్యంలో అత్యధిక విలువ గల పోషకాలు, విటమిన్లు ఉంటాయని, వీటి ద్వారా రక్తహీనత, జీర్ణ సమస్యలు రాకుండా ఉంటాయని తెలిపారు. రేషన్ బియ్యాన్ని ప్రజలు ఎవరు దళారులకు అమ్మవద్దని తెలిపారు. రేషన్ కార్డు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. ఈ సన్నబియ్యాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.



**రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో**

## గ్యాస్ట్రో వైద్య సేవలు

**- వైద్య సేవలను వినియోగించుకోవాలి**

**- రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జై సింగ్ రాథోడ్**

**ఆదిలాబాద్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో గ్యాస్ట్రో ఎంట్రనాలజీ సేవలను మంగళవారం రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జయ సింగ్ రాథోడ్, రిమ్స్ ఆస్పత్రి సూపర్డెంట్లు డాక్టర్ అశోక్ డాక్టర్ సత్యనారాయణ ఆర్ఎంఓ డాక్టర్ చంపత్ రావులో ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ డైరెక్టర్ జయసింగ్ రాథోడ్ మాట్లాడుతూ రిమ్స్ ఆస్పత్రిలో ఇప్పటివరకు మూడు రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కొత్తగా మంగళవారం రోజు గ్యాస్ట్రో ఎంట్రనాలోజి సేవలు రీమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఇప్పటి వరకు న్యూరో సర్జరీ యూరాలజీ క్యాన్సర్ పిల్లల సర్జరీ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకు రావడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అన్ని రకాల పరికరాలతో పాటు పరీక్షల తో పాటు ఆపరేషన్లకు అవసరమయ్యే అన్ని రకాల మి షన్లు అందుబాటులో ఉన్నాయని డైరెక్టర్ తెలిపారు. ప్రతీ మంగళవారం, గురువారం గ్యాస్ట్రోకి సంబంధిం చిన వైద్యులు డాక్టర్ వివేక్ రాథోడ్ మంగళ మరియు గురువారలో అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తారని ఆయన తెలిపారు. ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయని ఆదిలాబాద్ జిల్లా ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని ఆయన తెలిపారు.

## నిరుద్యోగులకు వరం.. రాజీవ్ యువ వికాసం

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

నిరుద్యోగ యువత ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా అవకాశం కల్పిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఎస్.సి., ఎస్.టి., బి.సి., మైనారిటీ, ఇతర వెనకబడిన తరగతుల నిరుద్యోగ యువత ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఈ పథకం ద్వారా చేయూత అందించడం జరుగుతుందని, అర్హులైన వారు ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 50వేల రూపాయల లోపు రుణం 100 శాతం మాఫీ, 1 లక్ష రూపాయల లోపు రుణం 90 శాతం రాయితీ, 1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు 80 శాతం రాయితీ, 2 లక్షల రూపాయల నుంచి 4 లక్షల రూపాయల వరకు 70 శాతం రాయితీ లభిస్తుందని,



రాయితీ పోను మిగిలిన మొత్తాన్ని బ్యాంకు రుణాల ద్వారా అందించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతిరోజు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. ఎల్.ఆర్.ఎస్ రుసుము చెల్లింపుదారులకు అవగాహన కల్పించాలన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

మహాత్మ జ్యోతిబా పులే బీసీ గురుకులాలలో 2025 - 26 విద్యా సంవత్సరానికి 6 నుండి 9 వ తరగతి వరకు ఖాళీగా ఉన్న బ్యాక్ లాక్ సీట్ల భర్తీ కోసం దరఖాస్తు గడువు ఏప్రిల్ 6 వరకు పొడిగించినట్లు గురుకులాల జిల్లా కన్వీనర్ శ్వేత సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రవేశాల గడువు మార్చి 31 వరకు ప్రకటించినప్పటికీ గురుకుల ఉన్నతాధికారుల ఆదేశానుసారం దరఖాస్తు గడువు పొడిగించినట్లు తెలిపారు.

# మొక్కజొన్న కొనుగోళ్లలో దళారుల దందా


ఆష్టా గ్రామంలో కల్లాల వద్దే రైతులతో 'మక్క' దళారుల బేరసారాలు

- రైతులను దగా చేస్తున్న దళారులు
- కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో తీవ్ర జాప్యం
- ఇప్పటికే తొలిదశ మక్క అమ్ముకున్న రైతులు
- అమాంతంగా ధరను తగ్గించేస్తున్న వైనం
- క్వింటాల్‌కు రూ.2600లకు కొనుగోళ్లు
- ముథోల్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో తిష్ట వేసిన నిజామాబాద్ జిల్లా వ్యాపారులు
- ప్రస్తుతం రూ.2వేలకు కూడా కొనుగోలు చేయడం లేదంటున్న రైతులు..
- అకాల వర్షాలు, అధికారుల నిర్లక్ష్యంతో అన్నదాతలకు తప్పని నష్టాలు
- దిగుబడులు బాగానే వచ్చాయని ఆనందించిన అన్నదాతకు అంతలోనే ఆశలు ఆవిరి..

**ముథోల్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లాలోని 18 మండలాల్లో 42,597 మంది రైతులు తమ భూముల్లో 87,664 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఇప్పటికే 50 శాతానికి పైగా పంట చేతికొచ్చింది. అత్యధికంగా ముథోల్ నియెజకవర్గం, ఖానాపూర్‌లో అత్యల్పంగా సాగు చేస్తున్నారు. పంటను అమ్ముకునేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులకు అమ్మి నష్టపోతున్నారు. ప్రస్తుతం రైతులు ఒక క్వింటాలుకు దాదాపు రూ.200లకు పైగా నష్టపోవడంతోపాటు, వారు చెప్పిన తేదీకే పైసలు ఇస్తామని చెప్పి రైతుల వద్ద నుంచి మక్కలను కొనుగోలు చేస్తున్నారు. ముథోల్ నియోజవర్గ పరిధిలోని ఆయా గ్రామాల్లో మొక్కజొన్న కర్షకుల కష్టం దళారుల పాలవుతోంది. ఈ సారి మొక్కజొన్న దిగుబడులు బాగా వచ్చాయని ఆనందంగా మురిసిపోయిన మొక్కజొన్న రైతు దిగుబడులను మార్కెట్‌లోకి తీసుకువచ్చే సరికి దళారులు అమాంతంగా ధరను తగ్గించడంతో రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. మొదట్లో క్వింటాల్‌కు రూ.2600ల వరకు కొనుగోలు చేసిన మక్క ధరను ప్రస్తుతం దళారులు, ప్రైవేట్ వ్యక్తులు 2వేలకు కూడా కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక్కసారిగా మక్క మార్కెట్‌లోకి భారీగా తరలివస్తుండడం ప్రభుత్వపరంగా ఇంకా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో అదును చూసి ప్రైవేట్ వ్యక్తులు, దళారులు సిండికేట్‌గా మారి ధరను తగ్గించేశారని మక్క రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు సంవత్సరాలుగా మొక్కజొన్నకు బహిరంగ మార్కెట్‌లో మంచి ధర లభిస్తుండడంతో ఈ సారి రైతులు భారీగా పంట సాగు చేశారు. ఆశాజనకంగానే దిగుబడులు వస్తుండడంతో ప్రభుత్వపరంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

**వేల ఎకరాల్లోనే మక్కల సాగు..**

జిల్లాలో వరి పంట తర్వాత ఎక్కువగా ఆరుతడి పంటలైన మొక్కజొన్న, జొన్న, శనగతో పాటు పప్పు దినుసు పంటలను రైతులు సాగు చేస్తుంటారు. జిల్లాలో వానాకాలం, యాసంగి సీజన్‌లోని ఈ పంటల సాగువైపే రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతుంటారు. నీటి లభ్యత ఎక్కువగా లేని ప్రాంతాల్లో ఈ పంట సాగు ఎక్కువగా ఉంది. ఈ ఏడాది దిగుబడులు ఎక్కువగా వస్తుండడంతో మద్దతు ధరకు కొను గోలు చేస్తే లాభాసాటిగా ఉంటుందని రైతులు ఆశలు పెట్టుకుంటున్నారు. పంటల విస్తీర్ణానికి తగ్గట్టుగా వాతావరణం అనుకూలించడంతో దిగుబడులు సైతం ఎక్కువగానే ఉన్నట్లు రైతులు భావిస్తున్నారు. మొక్కజొన్న ఎకరానికి 35 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖతో పాటు రైతులు అంచనా వేస్తున్నారు. విస్తీర్ణం ప్రకారం 90వేల క్వింటాళ్లలో దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే రైతులు ఈ పంటలను కోసి నూర్పిడి చేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. చాలా మంది రైతులు పంట చేన్లలోనే కుప్పలుగా పోసి ఉంచారు. ఓ వైపు అకాల వర్షాలు రైతులను వెంటాడుతున్నాయి.. ఇటీవల కురిసిన వడగళ్ల వానకు నియోజకవర్గంలోని చాలా ప్రాంతాల్లో కల్లాల వద్ద ఉన్న మక్కలు తడిసిపోయాయి.. రైతులు మళ్లీ వాటిని ఆరబెడుతున్నారు. అయితే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే మార్కెట్‌కు తరలిద్దామనుకున్నా.. ఇంకా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు.




**దళారులకు విక్రయిస్తూ నష్టపోతున్న రైతులు**

రాష్ట్ర ప్రభుత్వం తరపున మక్కలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు మార్కెట్‌లోని దళారులకు, ప్రైవేట్ వ్యక్తులకు విక్రయిస్తూ తీవ్రంగా నష్టపోతున్నారు. గత రెండేళ్ల కిందట సీజన్‌లో మక్కల కొనుగోళ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం వందకుపైగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేసింది. ప్రస్తుతం ప్రభుత్వాలు మొక్కజొన్న క్వింటాల్‌కు మద్దతు ధర రూ.2,300 కేటాయించింది. ఈ ఏడాది మక్కల కొనుగోళ్లపై మార్క్‌ఫెడ్ సైతం ఎలాంటి యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయకపోవడం గమనార్హం. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని మార్క్‌ఫెడ్ అధికారులు చెప్పుకొస్తున్నారు. ప్రభుత్వం తరుపున కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దీనిని ఆసరాగా చేసుకుని ప్రైవేట్ వ్యాపారులు, దళారులు సిండికేట్ అయి వారు నిర్ణయించిన మేరకే రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. గత పక్షం రోజుల కిందట ప్రైవేట్ వ్యక్తులు, దళారులు రైతుల వద్దకే పంట పొలాలకు వెళ్లి క్వింటాల్‌కు రూ.2600ల వరకు చెల్లించి కొనుగోలు చేశారని రైతులు చెబుతున్నారు. మార్కెట్‌లోకి మక్కలు చాలా వస్తున్నందున దళారులు ధరను అమాంతంగా తగ్గించేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.2వేలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని పది రోజుల వ్యవధిలోనే రూ.600 తగ్గించడం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. దీంతో నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



**సిండికేటైన వ్యాపారులు..**

ప్రభుత్వం సకాలంలో మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కేంద్రాలు ప్రారంభించకపోవడం దళారులకు కలిసి వచ్చింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన కొంత మంది వ్యాపారులు గ్రామాల్లో పలువురు ఫర్టిలైజర్ యజమానులు, వడ్డీ వ్యాపారులు, ప్రజాప్రతినిధులు దళారుల అవతారం ఎత్తారు. ఏజెంట్లను నియమించుకుని ముథోల్ నియోజకవర్గంలోని గ్రామాల్లో తమకు పరిచయం ఉన్న వారితో ఆయా ప్రాంతాలలో కొనుగోలు చేపట్టేలా చూస్తూ మొక్క జొన్నను రైతులు గ్రామాల్లోనే విక్రయించే విధంగా పావులు కదుపుతున్నారు. సిండికేట్‌గా ఏర్పడి తమ వ్యాపారాన్ని మూడు పూవులు.. ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. తమకు రవాణా ఖర్చులు తప్పడంతో పాటు అక్కడిక్కడే డబ్బులు చెల్లిస్తారనే ఉద్దేశంతో రైతులు కూడా వారికే విక్రయించడానికి సుముఖత చూపుతున్నారు. ఇటీవల నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ వ్యాపారి చించాల గ్రామంలో రైతుల వద్ద తక్కువ ధరకే మక్కలు కొనుగోలు చేశాడు.

**తూకంలోనూ మోసం..**

మొక్కజొన్న తూకం వేసేటప్పుడు ఎలక్ట్రానిక్ కాంటాలను వినియోగించాలనే నిబంధన ఉన్నా.. గ్రామాల్లో ఎక్కడా అవి కనిపించడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా దళారులు పాతరకం కాంటాలను వినియోగిస్తున్నారు. పాతరకం బాట్లు వాడడంతో క్వింటాలుపై సుమారు 15 కిలోలు అదనంగా తూకం వేస్తున్నారని సమాచారం. దీంతో రైతులు మరింతగా నష్టపోవాల్సి వస్తోంది. నిజామాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి అష్టా, చించాల గ్రామంలో ఈ విధంగా చేయడంతో గ్రహించిన రైతులు అతనితో తీవ్ర వాగ్వాదానికి దిగడంతో చివరకు అదనంగా డబ్బు చెల్లించి ఉండాయించాడు.

### కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి..



ఈ యాసంగిలో నాలుగెకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. రెండెకరాల్లో మక్కను కోసి తక్కువ ధరకు అమ్ముకున్నా. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినప్పటికీ కేంద్రాలను ఏర్పాటు చేయక పోవడంతో క్వింటాలుకు రూ.200 వరకు తక్కువకే ఇచ్చివేసిన. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. దళారులకు మక్కలన్నీ అమ్మిన తరువాత ఏర్పాటు చేస్తే ఏం లాభం ఉండదు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే దళారులు కూడా ధర పెంచుతారు. లేకుంటే వారు చెప్పిన ధరకే అమ్ముకోవాల్సి వస్తుంది. **ముత్యం రెడ్డి, రైతు**

### దళారులకు అమ్ముకున్న..



నేను 1.20 ఎకరాల్లో మక్క వేశా. మంచి దిగుబడి వచ్చింది. సర్కారోళ్లు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులకు అమ్ముకున్న. నెల తరువాత డబ్బులు ఇస్తామన్నారు. సరే అని అమ్మి వచ్చా. అనుకున్న ధర వస్తే బాగుండేది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ఉంటే క్వింటాలుకు రెండు, మూడు నూర్లు ఎక్కువ వస్తుండే. **లింగారాం పటేల్, రైతు**

### తక్కువ ధరకు అమ్మిన..



మొక్క కోసం నెల రోజులు కావస్తున్నా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో దళారులకు క్వింటాకు రూ.2000లకు అమ్ముకున్నాను. కొనుగోలు ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియడం లేదు. మొక్క జొన్నను ఆరబోసి రాశి చేశాను. వర్షాలు పడితే నష్టపోవాల్సి వస్తుంది. దీంతో తక్కువ ధరకే అమ్మిన. **ముసుగు మోహన్ రెడ్డి**

# విద్యుత్ ఘాతంతో రెండు దుప్పులు మృతి

## దుప్పి మాంసంతో పట్టుబడిన నిందితులు

**జైపూర్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**



జైపూర్ మండలం గంగిపల్లి-పెగడపల్లి అటవీ సరిహద్దులో పంట పొలం చుట్టూ అమర్చిన విద్యు త్ కంచెతో రెండు దుప్పులు మృత్యువాతన పడ్డాయి.. పొలం చుట్టు విద్యుత్ ఏర్పాటు చేసిన కంచె రెండు దుప్పుల ప్రాణం బలిగొంది. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు సంఘటన స్థలాన్ని సందర్శించగా మృతి చెందిన దుప్పుల మాంసంతో కట్టుబడినట్లు మంచిర్యాల అటవీ క్షేత్ర అధికారి రత్నాకర్ తెలిపారు. నిందితులు పాలమాకుల శ్రీనివాస్ రెడ్డి, గూడ పాపన్న పై కేసు నమోదు చేసి నిందితుల నుండి దుప్పుల మాంసము కొమ్ములు చర్మం స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు.

# ఆదిలాబాద్ ఆర్టీసీ ఆర్ఎంకు పదోన్నతి

**ఆదిలాబాద్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

ఉమ్మడి ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌గా పనిచేస్తున్న సోలోమను కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా పదోన్నతి కల్పిస్తూ బాధ్యతలు అప్పగించారు. అ యితే ఆదిలాబాద్ ఆర్ఎంగా ఇంకా ఎవరిని యమించలేదు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు త్వరలో వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కార్యాలయ ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఉరేసుకుని వృద్ధుడి బలవన్మరణం



**లక్షెట్టిపేట :** ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని పాత కొమ్ముగూడెం గ్రామానికి చెందిన గడికొప్పుల రామయ్య (65)తో అదే గ్రామానికి చెందిన వరుసకు అల్లుడైన సత్తయ్య కొంతకాలంగా గొడవపడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. గ్రామంలో కనిపించిన చోట బూతులు తిడుతూ వేధింపులకు గురిచేశాడు. దీంతో మనస్తాపానికి గురైన రామయ్య మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుమారుడు మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# జొన్న పంట దగ్ధం

**ఆదిలాబాద్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం దీపాయిగూడ గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో జొన్న పంట దగ్ధమైనది. వేసవి కాలంలో పంట పొలాల్లో దూరలకు నిప్పుపెట్టె క్రమంలో ఈ ప్రమాదం సంభవించింది. దీంతో గ్రామానికి చెందిన గిరిధర్ రెడ్డికి చెందిన మూడెకరాల జొన్న పంటకు నిప్పు అంటుకుని కాలి బూడిదయింది. సుమారు రెండు లక్షల మేర పంట నష్టం జరిగినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశారు.





## హెచ్‌సీయూ భూముల విక్రయాలు నిలిపివేయాలి

**జన్నారం, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ 400 ఎకరాల భూములు అమ్మకాలను ఆపాలని, సీపీఐ(ఎం) జన్నారం మండల కార్యదర్శి కనికరం అశోక్ మండల నాయకులు అంబటి లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మండల సీపీఐ(ఎం) సిఐటియు నాయకులను హైదరాబాద్ వెళ్లకుండా ముందస్తుగా జన్నారం పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాలించడం చేతగాక ప్రభుత్వ భూములను అమ్మడం సరికాదన్నారు. ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేయాలని లేకుంటే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు అన్నారు. హెచ్సీయూ 400 ఎకరాల ప్రభుత్వ భూమిని వేలం వేసి అమ్మి ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని చూస్తే ఊరుకోమన్నారు. వేలం పాటలను రద్దుచేసి భూమిని అమ్మకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

## ఏబికేఎంఎస్ జాతీయ కమిటీలో జిల్లా వాసికి చోటు



**మంచిర్యాల, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
దేశవ్యాప్త బొగ్గు గని కార్మికుల సమస్యల సాధన కోసం అఖిల భారతీయ కథాన్ మజ్దూర్ సంఘ్ (ఏ బి కే ఎం ఎస్) - బిఎంఎస్ నియమించిన ఇన్చార్జిలలో సింగరేణి విభాగం నుంచి మొదటి సారిగా రక్షణ కమిటీ సభ్యునిగా జిల్లాకు చెందిన నాతాడి శ్రీధర్ రెడ్డి నామినేట్ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సింగరేణి కార్మికుల సమస్యలపై, వారి రక్షణ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోరాడుతానని అన్నారు. బొగ్గు గని కార్మికుల సమస్యల సాధనకు, నిరంతరం సమస్యల పరిష్కారం చేయడానికి, కార్మికులకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తానన్నారు. నాపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఎస్ సి ఎం కె ఎస్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్యకి, ఏబీకేఎంఎస్ ప్రధాన కార్యదర్శి సుజిత్ సింగ్, రాష్ట్ర, జాతీయ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే

**ముథోల్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
కుంటాల మండలంలోని ఓల గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించి ఓ వడ్రంగి దుకాణం దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ బాధితులను మంగళవారం పరామర్శించి ఓదార్చారు. ప్రమాదంలో రాజశేఖర్, రంజిత్, రాకేష్‌కు చెందిన దుకాణం దగ్ధమైంది. బాధితులను ప్రభుత్వపరంగా ఆదుకుంటామన్నారు.

# నేటి యువత సన్మార్గంలో నడవాలి

### సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి - ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



**ఖానాపూర్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
యువత సన్మార్గంలో నడిచి, సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పిలుపునిచ్చారు. మంగళవారం ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వీర హనుమాన్ యాత్రలో ఆర్మూర్ నియోజకవర్గ శాసనసభ్యులు పైడి రాకేష్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... భారతదేశం భిన్న సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమని భిన్నత్వంలో ఏకత్వం కలదని పేర్కొన్నారు. ధర్మాన్ని కాపాడుకుంటూ మంచి మార్గం వైపు నడవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ సోదర భావంతో ఎదనిండా దేశభక్తి, దైవభక్తి, కలిగి ఉండి సన్మార్గం ఎంచుకోవాలన్నారు. ప్రతి అంశంలో మంచీ చెడు రెండూ ఉంటాయి. ప్రతి దానిని మంచి కోసం వినియోగించాలి. యువత మంచి మార్గంలో పయనించాలి. మత్తు పదార్థాలకు బానిస కావద్దు. జీవితాలను అంధకారం చేసుకోవద్దు. దేశభవిష్యత్తు, అభివృద్ధి నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధోనికేని దయా నంద్, పట్టణాధ్యక్షు లు నిమ్మల రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ పడగల భూషణ్, మాజీ మున్సిపల్ చైర్మన్లు రాజుర సత్యం, అంకం రాజేందర్, కావలి సంతోష్, బిజెపి జిల్లా అధ్యక్షులు రితీష్ రాథోడ్, రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్, మండల అధ్యక్షులు అంకం మహేందర్, పడాల రాజశేఖర్, బార్ కౌన్సిల్ ప్రెసిడెంట్ మంత్ర రాజ్యం సురేందర్ తదితరులు ఉన్నారు.

## మజ్జిగ పంపిణీ



**తాండూర్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలోని ఐబీలో మంగళవారం బీజేవైఎం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. గుండా సంతోష్ ప్రథమ వర్గంతి సందర్భంగా అతని జ్ఞాపకార్థం బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి గుండా బాలకృష్ణ సోదరులు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు గుండా సాయితేజ, గుండా నరేష్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుధీర్ గౌడ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏముర్ల ప్రదీప్, బిజెపి తాండూర్ మండల్ ప్రధాన కార్యదర్శి కొమండ్ల శ్రీనివాస్, బీజేవైఎం మండల అధ్యక్షులు మామిడి విఘ్నేష్, ప్రధాన కార్యదర్శి శంకర్, శ్రావణ్, సీనియర్ నాయకులు యంగర్ తుకారాం, నాయకులు దుర్కి బీరేష్, ఏముర్ల ప్రవీణ్, లక్ష్మణ్, సాత్విక్, అనుదీప్, సాయికుమార్, రామ్ చరణ్, సిద్ధార్థ్, మనోజ్, చంటి, తదితరులు పాల్గొన్నారు.

## ఆరె కులస్తులను సెంట్రల్ ఓబీసీలో చేర్చాలి

**కాగజ్‌నగర్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
ఢిల్లీలో మంగళవారం రాజ్యసభ సభ్యులు, భారతీయ జనతా పార్టీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షులు డా.లక్ష్మణ్ ని మర్యాద పూర్వకంగా కలిసిన సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు. ఈ సందర్భంగా సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో ఆరె కులస్తులు పెద్ద ఎత్తున ఉన్నారని, వారిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ(డి) గా గుర్తిస్తుందని, జాతీయ ఓబీసీ లిస్టులో వారి పేరు లేకపోవడంతో జాతీయ విద్యా ఉపాధి సంస్థల్లో వారికి అవకాశాలు దొరకడం లేదని తెలిపారు. సానుకూలంగా స్పందించిన డా.లక్ష్మణ్ జాతీయ వెనకబడిన తరగతుల కమిషన్ ఇదివరకే కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయడం జరిగిందని, కేంద్ర కేబినెట్ అప్రూవల్‌తో ఈ సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు.



## హెచ్.సి.యూ భూముల విక్రయాన్ని నిలిపివేయాలి



**మంచిర్యాల, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
హెచ్.సి.యూ భూముల విక్రయాన్ని వెంటనే ఆపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్ సీ యు) విద్యార్థుల మీద, ఎస్ఎఫ్ఐ విద్యార్థి యూనియన్ నాయకులపై పోలీసుల నిర్బంధాన్ని సిపిఎం జిల్లా కమిటీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. హెచ్.సీ.యు భూముల రక్షణ కోసం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్నాకు వెళ్లకుండా ముందస్తుగా సిపిఎం పార్టీ నాయకత్వాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పోరాటాల మీద, నాయకుల మీద నిర్బంధం పెరిగిందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాయ మాటలు చెప్పి అధికారం చేపట్టాక గత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు అనుసరిస్తుందని విమర్శించారు. 400 ఎకరాల సెంట్రల్ యూనివర్సిటీ భూమిని అమ్మకానికి పెట్టే ప్రయత్నాలను ప్రభుత్వము ఇప్పటికైనా విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాలను, విద్యా వ్యవస్థను బలోపేతం చేయవలసిన దశలో రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుందన్నారు. 400 ఎకరాల భూమి అమ్మకం ప్రయత్నాలను విరమించాలని, విద్యార్థుల మీద కేసులు ఉపసంహరించకోవాలని, తక్షణం అరెస్టు చేసిన విద్యార్థులను, రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం నాయకత్వాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## 2, 3 తేదీలలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి, దొడ్డి కొమురయ్య జయంతి

**మంచిర్యాల, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో మహనీయుల వర్ధంతి, జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఎ. పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2వ తేదీ ఉదయం 11 గంటలకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి, 3వ తేదీ ఉదయం 11 గంటలకు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను నిర్వహించడం జరుగుతుందని, అధికారులు, సంఘ నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

## ఎమ్మెల్యే ప్రేం సాగర్ రావు ఫ్లెక్సీ తొలగింపుపై నిరసన



**బెల్లంపల్లి, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదురుగా గల మెయిన్ రోడ్డుతో పాటు అంబేద్కర్ చౌరస్తా వద్ద మంగళవారం మైనార్టీ నాయకులు ఏర్పాటుచేసిన మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఫ్లెక్సీని మున్సిపల్ సిబ్బంది తొలగించి చెత్త బండిలో వేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ మైనార్టీ నాయకులు ఎండి గౌస్ భాయ్ నిరసన తెలిపారు. ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా తాను ప్రేంసాగర్ రావుపై అభిమానంతో పట్టణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది తొలగించడం సరైనది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కమిషనర్ సమాధానం ఇవ్వాలని రోడ్డుపై బైఠాయించి నిరసన చేశారు. విషయం తెలిసిన వెంటనే వన్ టౌన్ ఎస్సై రాకేష్ అంబేద్కర్ చౌరస్తా వద్దకు చేరుకొని కాంగ్రెస్ మైనార్టీ నాయకులు వెండి గౌస్ బాయ్ ని సముదాయించడంతో ఆందోళన విరమించారు. తొలగించిన ఎమ్మెల్యే ఫ్లెక్సీని అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటుచేయడంతో వివాదం సద్దుమణిగింది.

# యూనివర్శిటీ భూములను సంరక్షించాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను సంరక్షించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ భూములకు రక్షణ కరువైపోయింది, విచ్చలవిడిగా భూములను ఆక్రమించుకుంటున్నారు. చివరికి విద్యాసంస్థల భూములను కూడా వదలడం లేదనీ వాపోయారు. ఉత్తర భారత దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీలలో ఎచ్ సీ యూ ఒకటి అలాంటి యూనివర్సిటీ భూములను గత కొద్ది రోజులుగా కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు వేలం వేసి అమ్మే ఆలోచనలో ఉందని యూనివర్సిటీ విద్యార్థులు ఆ భూములను కాపాడుకోవాలని అక్కడ ఉన్న ప్రకృతిని రక్షించుకోవాలని పక్షులు, జంతువులుకు రక్షణ కల్పించాలని ఉద్దేశంతో సామరస్యంగా నిరసన కార్యక్రమం తెలియజేస్తే ప్రభుత్వం పోలీస్ బలగాలతో విద్యార్థులను చాలా కిరాతకంగా ఈడ్చుకుంటూ పోలీస్ వాహనాలలో ఎక్కించుకొని అక్రమంగా అరెస్టు చేసి కేసులు పెట్టిందన్నారు. అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, కార్తీక్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## జన్నారం వాసికి గ్రూప్- 1లో 161 ర్యాంక్



**జన్నారం, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

మండలంలోని పొన్కల్ గ్రామపంచాయతీకి చెందిన నగురు హరిదాస్ భాగ్యలక్ష్మి దంపతుల మూడో కొడుకు అనిల్ కుమార్ రాష్ట్రస్థాయిలో ఇటీవలే వెలువడిన గ్రూప్-1 ఫలితాల్లో 161 ర్యాంక్ సాధించారు. గతేడాది గ్రూపు-4లో ఎంపికైన అనిల్ కుమార్ ప్రస్తుతం హైదరాబాద్ లోని ఉస్మానియా యూనివర్సిటీలో జూనియర్ అసిస్టెంట్గా పనిచేస్తు న్నాడు. తన తండ్రి హరిదాస్ ఆర్టీసీలో కండక్టర్గా పనిచేశారు. పదేండ్ల క్రితమే అనారోగ్యంతో మృతి చెందాడు. అనిల్ కుమార్ సోదరుల్లో పెద్దవాడైన అరుణ్ కుమార్ ఆర్టీసీ డ్రైవర్గా, రెండో సోదరుడు అజయ్ కుమర్ ట్రాన్స్ కోలో అసిస్టెంట్ ఏఈగా పనిచేస్తున్నారు. అనిల్ కుమార్ కు గ్రూప్ వన్ లో 161వ ర్యాంకు రావడంతో ఉన్నత స్థాయిలో ఉద్యోగం వస్తుందని ఆ కుటుంబ సభ్యులు ఆనందం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో సన్న బియ్యం సంబరాలు



**మందమర్రి, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన రేషన్ కార్డ్ దారులకు సన్న బియ్యం పథకాన్ని కాంగ్రెస్ నాయకులు ప్రారంభించి సంబరాలు నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని అంగడి బజార్ ఏరియాలో ఉచిత సన్న బియ్యం పథకాన్ని రేషన్ షాప్ వద్ద నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు సోత్కు సుదర్శన్, పట్టణ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్ లు మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో పేద ప్రజలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రజలంతా రుణపడి ఉంటారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి ఉగాది నుండి సన్న బియ్యం పథకాన్ని ప్రారంభిస్తామని చెప్పి మాట నిలుపుకున్నారని వారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, నాయకులు పుల్లూరి లక్ష్మణ్, గడ్డం రజిని, మంకు రమేష్, నెరవేట్ల శ్రీనివాస్, మంద తిరుమల్ రెడ్డి, ఎండి సుకూర్, జమీల్, రాజు, రాచర్ల రవి, బుర్ర ఆంజనేయులు, సోతుకు ఉదయ్, సట్ల సంతోష్, రాచర్ల గణేష్, రాయబారపు కిరణ్, మాయ తిరుపతి, బండి శంకర్, వీరన్న, నరసయ్య రావుల శ్రీనివాస్, రాజయ్య లింగయ్యలు పాల్గొన్నారు.

## పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం





**లక్షెట్టిపేట, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

పేద ప్రజలకు అండగా ప్రభుత్వం ఉంటుందని మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చల్లా నాగభూషణం అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని అన్ని రేషన్ షాప్ ల వద్ద సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... రేషన్ కార్డు కల్గిన ప్రతీ లబ్ధిదారునికి ప్రతీ నెల సన్నబియ్యం పంపిణీ జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తూ తెలంగాణను రోల్ మాడల్ గా తీసుకుంటుందన్నారు. ప్రజా ప్రభుత్వం ఎల్లవేళలా ప్రజల కోసం పనిచేస్తుందని ప్రజలంతా తెలంగాణ ప్రభుత్వంపై పూర్తి విశ్వాసంతో ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల ప్రభుత్వం అని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర రావుకు సీఎం రేవంత్ రెడ్డికి మండల, మున్సిపాలిటీ పేదల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పూర్ణచెందర్ రావు, చింత అశోక్ కుమార్, జిల్లా ఆర్టిఏ మెంబెర్ అంకతి శ్రీనివాస్, మండల అధ్యక్షులు పింగళి రమేష్, మున్సిపాలిటీ అధ్యక్షులు ఎండి ఆరిఫ్ యూత్ అధ్యక్షులు రాందేని చిన్న వెంకటేష్, మార్కెట్ కమిటీ డైరెక్ట్ తోట రమేష్, మాజీ కౌన్సిలర్ రాందేని వెంకటేష్, నాయకులు అరిగేల చెందు, భూమేష్, అమీర్, హాజీ గోపతి రమేష్, వివిధ వార్డ్ అధ్యక్షులు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



### సన్న బియ్యానికి రేషన్ కార్డు

## ఉన్నవారందరూ అర్హులే

### బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**బోథ్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పేదలకు సన్న బియ్యం పథకం తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు అర్హులేనని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం బోథ్ పట్టణంలోని 5వ రేషన్ షాపులో సన్న బియ్యం పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అర్హులైన ప్రజలందరూ విధిగా ఈ సన్న బియ్యంను ఉపయోగించుకోవాలని సూచించారు. సన్న బియ్యాన్ని అర్హులందరికీ అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, రేషన్ డీలర్లు అందరూ సమయపాలన పాటిస్తూ ప్రజలకు సన్నబియ్యాన్ని అందించాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట మాజీ జెడ్పిటిసి సంధ్యారాణి, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, పలువురు బిఆర్ఎస్ నాయకులు, రెవెన్యూ అధికారులు ప్రజలు ఉన్నారు.

### ప్రభుత్వం కేటాయించిన భూమిని

## సింగరేణి తీసుకోవద్దు



**బెల్లంపల్లి, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సముదాయంలో ఇటీవల జరిగిన ఎస్సీ, ఎస్టీ రివ్యూ మీటింగ్లో బెల్లంపల్లి మండలంలోని కాసిరెడ్డి పల్లెకి చెందిన కుశ్నపల్లి రాజలింగు తనకు ప్రభుత్వం కేటాయించిన వ్యవసాయ భూమిలో సింగరేణి యాజమాన్యం చేపట్టిన సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణం వల్ల తన కుటుంబానికి అన్యాయం జరిగిందని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు రేణి కుంట్ల ప్రవీణ్ మంగళవారం మందమర్రి ఏరియా జీఎం దేవందర్, ఎస్టేట్ అధికారులతో కలిసి భూమిని పరిశీలించారు. ప్రభుత్వం పునరావసం కింద కేటాయించిన భూమిని తిరిగి సింగరేణి తీసుకోవద్దని కోరారు. సమస్య పరిష్కారానికి సింగరేణి అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు.

## సన్న బియ్యం పంపిణీ ప్రారంభం

**బజార్‌హత్నూర్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలోని షాప్ నంబర్-2లో ఉచిత సన్న బియ్యం పంపిణీ పథకాన్ని మంగళవారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మల్లెపూల నర్సయ్యతో కలిసి డిప్యూటీ తహసిల్దార్ హిరలాల్లు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఉచిత సన్న బియ్యం పథకం పేద ప్రజలకు వరంగా మారనుందన్నారు. మాజీ ఎంపీటీసీ లక్కం తిరుమల, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ జల్కే పాండురంగ్, నాయకులు అరే పాండు, కిషన్, విట్టల్, ఆర్ఐ రాథోడ్ నూర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**సారంగాపూర్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అన్నారు మంగళవారం కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని తాసిల్దార్ శ్రీదేవితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో 32 రేషన్ షాపుల ద్వారా తెల్ల రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు సన్న బియ్యం అందజేయడం జరుగుతుందన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఈ వినూత్న కవిత్వం ప్రారంభించిందని అన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే ఫోర్టిఫైడ్ రేషన్ బియ్యంలో అత్యధిక విలువగల పోషకాలు విటమిన్లు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు బొల్లోజి నర్సయ్య, డిసిసిబి డైరెక్టర్ నారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ ఆది, మాజీ చైర్మన్లు దశరథ రాజేశ్వర్ , రాజ్ మహమ్మద్, నాయకులు ఓ.నారాయణ రెడ్డి,నర్సారెడ్డి, రాజేశ్వర్ రావు, చద్ర ప్రకాష్ గౌడ్,లక్ష్మారెడ్డి,శంకర్, సలీం,డీలర్లు నారాయణరెడ్డి ఈశ్వర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

### తాగునీటి సమస్య పరిష్కరించాలని..

## ఖాళీ బిందెలతో నిరసన

**భీమిని, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

మండలంలోని వడాల గ్రామంలోని ఎస్సీ కాలనీ వాసులు తాగునీటి సమస్యను పరిష్కరించాలని మంగళవారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజులుగా నీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నామని, మిషన్ భగీరథ ట్యాంక్కు విద్యుత్ కనెక్షన్ లేదని, నీరు ట్యాంకు లోనికి ఎక్కడం లేదని వివిధ కారణాల సాకులతో కాలాయాపన చేస్తున్నారని మండి పడ్డారు. నీటి కోసం చేతి పంపుల వద్దకు వెళ్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ ట్యాంకుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి తమ కాలనీకి నీరు సరఫరా చేయాలని వారు కోరారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామన్నారు.





# అధికారం ఉన్నా.. లేకున్నా అనుక్షణం ప్రజలకు అండగా ఉంటా

- ప్రజా సేవకే నా జీవితం అంకితం
- ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
- మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప
- ఉచిత కంప్యూటర్ కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించిన కోనప్ప



**బెజ్జూర్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

బెజ్జూర్ మండలం కేంద్రంలోని ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో చేతన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని మంగళవారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులు ఉచిత కంప్యూటర్ శిక్షణ శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఫౌండేషన్ సభ్యులు సురేష్, మాజీ జెడ్పి చైర్మన్ కోనేరు కృష్ణలు మాట్లాడుతూ చేతన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిర్పూర్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఎన్నో కార్యక్రమాలు సహాయ సహకారాలు అందించడం జరిగిందన్నారు. కోనప్ప వల్లే మేము సిర్పూర్ నియోజక వర్గంలోని ప్రజలకు సేవ చేయడానికి అవకాశం వచ్చిందని అన్నారు. ప్రతిక్షణం ప్రజల గురించి ఆలోచించే నాయకుడు దొరకడం సిర్పూర్ నియోజకవర్గం ప్రజల అదృష్టం అన్నారు. బెజ్జూర్ మండల కేంద్రంతో పాటు కుంటలమానపల్లి గ్రామంలో ప్రారంభించడం జరిగిందన్నారు. అలాగే త్వరలోనే సోమిని, సలుగుపల్లి గ్రామాల్లో కూడా ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. ఉన్నతమైన కార్యక్రమాలలో మాకు భాగస్వామ్యం అందిస్తున్నా కోనేరు కొనప్పకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గ ప్రజల కోసం ఎల్లప్పుడూ తన వంతు కృషి చేస్తామని అన్నారు. అడిగిన వెంటనే సిర్పూర్ నియోజకవర్గ ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తున్న చేతన్ ఫౌండేషన్ వారికి ధన్యవాదాలు తెలియజేశారు. అధికారం ఉన్న లేకున్నా అనుక్షణం ప్రజలకు అండగా ఉంటాను అన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

---

### కుచిర్యాల గ్రామ సమస్యలు

# తీర్చే బాధ్యత నాది

## బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**బోథ్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

మండలంలోని కుచిర్యాల గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, మహిళలు ఎమ్మెల్యేకు హారతి పడుతూ స్వాగతం పలికారు. గ్రామంలో గల జగదాంబ దేవి సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో నెలకొన్న సమస్యలపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో గ్రామంలో అన్ని సిసి రోడ్లు నిర్మిస్తామని, త్వరలో బీటీ రోడ్డు పనులు కూడా ప్రారంభిస్తామని, ఒక్కొక్కటిగా సమస్యలు అన్ని తీర్చే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.



---

# సన్న బియ్యం పంపిణీ చరిత్రలో నిలిచిపోయే పథకం

- మంచిర్యాల జిల్లా డీసీసీ అధ్యక్షురాలు సురేఖ
- సన్న బియ్యంను సద్వినియోగం చేసుకోవాలి..





**మంచిర్యాల, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

పేదవారికి సన్న బియ్యంతో పట్టెడన్నం పెట్టాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచన గొప్పదని, తెలుగు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఈ పథకాన్ని ప్రారంభించామని మంచిర్యాల డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు అన్నారు. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని పాత మంచిర్యాల రేషన్ షాప్ వద్ద సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించిన అనంతరం లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి పేదవారి ఇంటికి సన్నబియ్యం చేరాలన్న చారిత్రాత్మక పథకానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారని, ఇది చరిత్రలో, పేదవారి గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయే పథకం అని అన్నారు. ప్రతి పేదవారి ఇంట ప్రతి రోజూ పండుగ జరగాలన్న ఆలోచనతో, పేద వారి కడుపు నింపాలన్న లక్ష్యంతో ఈ సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి ప్రభాకర్, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు, పాత మంచిర్యాల ప్రజలు పాల్గొన్నారు.

---

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**కాసిపేట, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

కాసిపేట మండలానికి చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ అందజేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులను అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కాసిపేట మండల నాయకులు పాల్గొన్నారు.



---



### సన్న బియ్యాన్ని పేద ప్రజలు

# సద్వినియోగం చేసుకోవాలి

## ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వం అందజేస్తున్న సన్నబియ్యాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని హాడ్కోకాలనీ రేషన్ దుకాణాల్లో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వం అందజేస్తున్న సన్న బియ్యం ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యం దళారులకు విక్రయించకూడదని వాడుకోవాలని తెలిపారు. బియ్యం అక్రమ రవాణా జరగకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సాధించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రోహిత్, డిప్యూటీ తహసిల్దార్ పోచ్చయ్య, రేషన్ డీలర్ అసోసియేషన్ సంఘం నాయకులు రేగుంట కేశవరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

---

# బెట్టింగ్ యాప్‌లపై ఉక్కుపాదం

- జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా ఏర్పాటు
- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు
- బెట్టింగ్ కేసులో ఇద్దరి అరెస్ట్
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడి



**ఆదిలాబాద్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

యువత, విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్, నిషేధిత ప్లే కార్డ్స్ గేమింగ్ యాప్‌లకు, ఐపీఎల్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. బెట్టింగ్ కేసులో ఇద్దరినీ అరెస్టు చేశామని తెలిపారు. మంగళవారం ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. ఎస్ఐ అశోక్, సిబ్బంది కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, ఆదిలాబాద్లోని డైట్ గ్రౌండ్‌లో కొందరు వ్యక్తులు ఆన్‌లైన్‌లో 'క్రిక్ బీట్ 99' యాప్ ద్వారా ఐపీఎల్ బెట్టింగ్ ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారంతో దాడి చేశారు. షేక్ సాజీద్, జోగు సాయి కుమార్ బెట్టింగ్ నిర్వహిస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. షేక్ సాజిద్ ఫోన్‌ను పరిశీలించగా, అతను ఆన్‌లైన్ బెట్టింగ్ 'క్రిక్ బీట్ 99' యాప్‌లో నమోదు చేసుకుని, సాయి కుమార్ నుంచి డబ్బు తీసుకుంటున్నట్లు నిర్ధారించారన్నారు. వీరి నుండి రూ.1500, రెండు మొబైల్ ఫోన్‌లు, యాప్ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. తక్కువ సమయంలో సులభంగా ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చన్న భ్రమలో యువత, విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్, గేమింగ్ యాప్స్‌లకు బానిసలుగా మారి, అప్పుల పాలపై ప్రాణాలకు మీదకు తెచ్చుకుంటున్నారని ఎస్పీ అన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్, ప్లే కార్డ్, గేమ్స్ కట్టడికి జిల్లా పోలీస్ శాఖ ఆధునిక సాంకేతికతను వినియోగించుకొని ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై బెట్టింగ్ ప్రోత్సహించిన, నిర్వహించిన, బెట్టింగ్ పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఐలు సునీల్ కుమార్, కరుణాకర్, ఎస్ఐ అశోక్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా

**ప్రత్యేక ప్రణాళిక - ఉపాధ్యాయులకు లక్ష్యాలు - అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా మౌలిక వసతులు**



**ఆదిలాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. మరోవైపు ప్రైవేట్ స్కూల్స్‌లో భారీగా పెరుగుతోంది. దీన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం వచ్చే విద్యాసంవత్సరంలో ప్రభుత్వ స్కూల్స్‌లో విద్యార్థుల సంఖ్యను పెంచి పూర్వవైభవం తీసుకురావాలని ఆలోచిస్తోంది.

**ప్రత్యేక ప్రణాళిక...**
ఒక్కో విద్యార్థికి దాదాపు 80 వేల రూపాయల వరకు ఖర్చు చేస్తూ విద్యతోపాటు మధ్యాహ్న భోజనం, ఉచితంగా పుస్తకాలు, యూనిఫామ్స్‌ను అందిస్తోంది. పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నా విద్యార్థుల చేరికలు ఎందుకు తగ్గుతున్నాయనేదానిపై క్షేత్రస్థాయి నుంచి సమాచారాన్ని సేకరిస్తోంది. బడిబాట కార్యక్రమాన్ని చేపట్టి బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించడం, బడిమానేసిన వారిని చేర్పు కోవడం వంటివాటిని మరింత పకడ్బందీగా నిర్వహించేదుకు ప్రణాళిక రూపొందించింది. ఏప్రిల్ 23 నుంచి వేసవి సెలవులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈ సెలవుల్లో ఉపాధ్యాయులకు విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, పాఠశాలల్లోని సౌకర్యాలను వివరించడం వంటివాటిపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఇందుకోసం విధివిధానాలను ఖరారుచేసి సెలవులకు ముందే వాటిని ప్రకటిస్తుందని ఇటీవల జరిగిన జిల్లా విద్యాశాఖ అధికారుల సమావేశంలో ఉన్నతాధికారులు చెప్పినట్లు తెలిసింది.

**ఉపాధ్యాయులకు లక్ష్యాలు...**
ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులకు లక్ష్యాలు నిర్దేశించడంతోపాటు చేర్పించిన విద్యార్థుల సంఖ్యను బట్టి వారికి ప్రోత్సాహాన్ని అందించే విధంగా పాయింట్స్‌ను ఇస్తారు. ఉపాధ్యాయులు సాధించిన పాయింట్స్‌ను వారి సర్వీసు బుక్కుల్లో చేర్పించి పదోన్నతులు, బదిలీల సమయంలో వారికి ప్రయోజనం చేకూర్చుతారు. దీంతో ఉపాధ్యాయులు మరింత ఉత్సాహంగా విద్యార్థులను చేర్పించేందుకు కృషి చేస్తారని భావిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా గత మార్చినెలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమే మే?ధ) ద్వారా బోధనను ప్రభుత్వం ప్రారంభించింది. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారి ప్రావీణ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తోంది. గత రెండు, మూడేళ్లుగా ఈ సంఖ్య తగ్గుతోంది. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు కంప్యూటర్ ద్వారా వారికి అర్థమయ్యేలా విద్యాబోధన చేసేం దుకు 50కిపైగా విద్యార్థులున్న పాఠశాలలకు రెండేసి కంప్యూటర్లు, హెడ్ ఫోన్స్‌ను పంపించేందుకు చర్యలు తీసుకుంటుంది.

**అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా మౌలిక వసతులు...**
అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చే విధంగా ఆధునిక హంగులతో తరగతి గదులు, ఫర్నీచర్, ఫ్యాన్లు, తాగునీటి వసతి, భోజన గది వంటి మౌలిక సదుపాయాలను కల్పించారు. కలెక్టర్ పమేలా సత్పతి ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టిపెట్టారు. కూరగాయలను పండించి, వాటితో మధ్యాహ్న భోజనం పెట్టే విధంగా కిచెన్, విటమిన్ గార్డెన్స్‌ను ఏర్పాటు చేయిస్తున్నారు. ఇప్పటికే పలు పాఠశాలల్లో పండించిన కూరగాయలతో మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు. ఈ చర్యల ద్వారా విద్యార్థుల సంఖ్యను పెంచి ప్రభుత్వ పాఠశాలలకు మళ్లీ పూర్వవైభవం తెచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.




## హెచ్‌సీయూ భూముల జోలికి వస్తే ఊరుకోం

**ఆదిలాబాద్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల జోలికొస్తే ఊరుకునేది లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేశ్ అన్నారు. మంగళవారం కలెక్టర్ ఆఫీస్ ఎదుట రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. గణేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు 400 ఎకరాలను వేలం వేసి ఇతర ప్రైవేట్ కార్పొరేటు కంపెనీలకు అప్పచెప్పే ప్రయత్నం చేస్తున్నారని, మా భూములు మాకు కావాలనీ శాంతి యుతంగా ధర్నాలు చేస్తుంటే విద్యార్థుల పైన పోలీసులు లాఠీచార్జి చేస్తూ, అరెస్టు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు కొట్నాక్ సక్కు, సాయి ప్రీతం, యమున, రమ్య, దివ్య, అఖిల్, కళ్యాణ్ రామ్ పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే పాయల్ శంకర్ అరెస్టు..**
హైదరాబాద్‌లోని 400 ఎకరాల హెచ్‌సీయూ భూములను కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మకానికి పెట్టడంతో మంగళవారం ఆ ప్రాంతాన్ని సందర్శించడానికి వెళ్లనున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను, బీజేపీ రాష్ట్ర నాయకులను హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. ఎమ్మెల్యే క్వార్టర్‌లో పోలీసులు అరెస్టు చేయగా నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు.

## ఉపాధ్యాయుడికి వినూత్న రీతిలో వీడ్కోలు

**తలమడుగు, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
మండలంలోని దేహగామలో పదవీ విరమణ పొందిన గురువుకు గ్రామస్తులు సెండాఫ్ ఘనంగా ఇచ్చారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా సేవలందించిన ముస్కు సంజీవరెడ్డి దంపతులను మంగళవారం గ్రామస్తులు ఎడ్ల బండిపై ఊరేగించారు. అనంతరం ఉపాధ్యాయ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలచిరాం, జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ ముస్కు సంజీవరెడ్డి 27 ఏళ్లుగా పేద విద్యార్థులకు అందించిన సేవలు అభినందనీయమన్నారు. విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేశారన్నారు. ఆయన సేవలు ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకట్రావు, టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జలంధర్‌రెడ్డి, లింగారెడ్డి, రామారావు, మౌనిష్ రెడ్డి, రాంరెడ్డి, దేవన్న, త్రియంబక్, తదితరులు పాల్గొన్నారు.





## ఏబికేఎంఎస్ ఇన్‌చార్జీలు వీరే

**మంచిర్యాల, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
దేశవ్యాప్త బొగ్గు గని కార్మికుల సమస్యల సాధన కోసం బొగ్గు పరిశ్రమల ఇంచార్జ్, జాతీయ సేఫ్టీ కమిటీ సభ్యులు కొత్త కాపు లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు అఖిల భారతీయ కథాన్ మజ్దూర్ సంఘ్ (ఏబికేఎంఎస్) - బిఎంఎస్ ఇన్చార్జిలను కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిత్వ శాఖ సమన్వయ కమిటీ, ఏబికేఎంఎస్ ప్రధాన కార్యదర్శి సుజిత్ సింగ్ మంగళవారం నియమించారు. సంస్థాగత ఇంటర్నల్ ఆడిటర్ ఇన్చార్జిలుగా మండ రమాకాంత్ (సింగరేణి విభాగం, హైదరాబాద్), సురేష్‌రాథోడ్ (జమున, కోల్ కత్త), అధికార ప్రతిని-ధులు (మీడియా ఇన్చార్జులు)గా యాదగిరి సత్తయ్య (అధ్యక్షులు, సింగరేణి విభాగం), జయంత్ అసోల్ (నాగపూర్), అనూప్‌సింగ్ (రాంచి), సుదర్శన్ (మోహంతి, తాల్చేర్), దీపక్ సింగ్ చౌహాన్ (నాగపూర్), సంజయ్ సింగ్ (భట్నుప్)లు నియామకమయ్యారు. సేఫ్టీ (రక్షణ) కమిటీ సభ్యులుగా నాతాడి శ్రీధర్ రెడ్డి (సీనియర్ మైనింగ్ సర్దార్, శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి విభాగం), ఉమేష్ కుమార్‌సింగ్ (ధన్‌బాద్), సంజయ్‌సింగ్ (భట్నుప్), జయంత్ అసోల్ (నాగపూర్), సుజిత్ ఝా (నైవేలి), సుస్మిత పాటిల్ (భసుంధరా), అంగద్ ఉపాధ్యాయ (రాజభ-వనం), లీగల్ సెల్ (న్యాయ విభాగం) ఇన్చార్జిలుగా పులి రాజారెడ్డి (సింగరేణి విభాగం హైదరాబాద్), పి.మాధవ నాయక్ (సింగరేణి విభాగం కొత్తగూడెం), ఆనంద్ ప్రతాప్ సింహ్ (ఉమ్ రెడ్), సుస్మిత పాటిల్ (భసుంధరా), దిలీప్ సత్ పుతె (చంద్రాపూర్), మెడికల్ (ఫార్మసీ) విభాగం ఇన్చార్జిలుగా పి.మాధవ నాయక్ ( సింగరేణి, కొత్తగూడెం), రాజ్ కుమార్ సింగ్ ( సింగ్రోలి), అక్షర్ కరే మోహ్ (సానర్), పెన్షనర్స్ (పదవి విరమణ పొందిన) విభాగానికి మండ రమాకాంత్ ( సింగరేణి హైదరాబాద్), మజ్రుల్ హక్ అన్సారి (బిస్రాంపూర్), అరుణ్ ప్రధాన్ (తాల్చేర్), నారాయణరావు శరత్కర్ (కన్హన్), రవీంద్ర మిశ్రా (దొరి)లు నియామకమయ్యారు.



## పేదల ఆనందమే ప్రభుత్వ లక్ష్యం

**■ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

**జన్నారం, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
ఇకనుంచి రేషన్ దుకాణాలలో దొడ్డు బియ్యం ఇస్తే ఎవరు తీసుకోవద్దని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్య పథకానికి శ్రీకారం చుట్టారు. మండల కేంద్రంలోని జిసిసి చౌక ధరల దుకాణంలో లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ.. ఉగాది కానుకగా రాష్ట్ర వ్యాప్తంగా తెల్ల రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తోందని తెలిపారు. ప్రజా ప్రభుత్వ హయాంలోనే పేద ప్రజలకు మేలు జరుగుతోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 50 రూపాయలు ఖర్చు పెట్టి కొనుగోలు చేసిన సన్న బియ్యాన్ని లబ్దిదారులకు ఉచితంగా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. పేదలకు నాణ్యమైన బియాన్ని అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పథకానికి శ్రీకారం చుట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రాజ మనోహర్ రెడ్డి, ఎంపీడీవో ఉమర్ షరీఫ్, ఆర్ఐ గంగరాజా, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు ముజాఫర్ మాణిక్యం, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, మాజీ చైర్మన్ ముత్యం సతీష్, మోహన్ రెడ్డి సుభాష్ రెడ్డి మిక్కిలినేని రాజశేఖర్, రియాజుద్దీన్ , దాముఖ కరుణాకర్ నందు నాయక్ ఏ.వి.ఆర్, రమేష్ ఇసాక్ ఇందయ్య, మత్స్య శంకరయ్య, ఇసాక్ రాజన్న గంగన్న అజారుద్దీన్, బందారి స్వామి, ఇతర అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 14న మెగా రక్తదాన శిబిరం నిర్వహించాలి

- మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించి తల సేమియా
- సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులను ఆదుకోవాలి..
- 832 మంది తలసేమియా సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులు
- యువత, విద్యార్థులు రక్తదానికి ముందుకు రావాలి

**మంచిర్యాల, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఏప్రిల్ 14న సింగరేణి ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్, ఎస్సీ ఎస్టీ ఆఫీసర్స్ అసోసియేషన్, దళిత సంఘాల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించాలని తలసేమియా సికిల్ సెల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ కోరారు. సింగరేణి వ్యాప్తంగా మందమర్రి, శ్రీరాంపూర్, రామగుండం ఏరియాల వ్యాప్తంగా మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించి తల సేమియా సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులను ఆదుకోవాలని కోరారు. మంచిర్యాల రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకులో తలసేమియా సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులు 832 మంది వ్యాధిగ్రస్తులు ఉన్నారని వీరందరికీ ప్రతి 15 రోజులకొకసారి రక్తము అందించాల్సి ఉంటుందని అన్నారు. మంచిర్యాల ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో రక్తం అవసరం ఉన్న ప్రతి పేషెంట్‌కు కిడ్నీ డయాలసిస్, గర్భిణీ స్త్రీలకు, రక్తహీనత వారికి, శస్త్ర చికిత్సలు అవసరం ఉన్న వారందరికీ మంచిర్యాల రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ ద్వారా ఉచితంగా రక్తాన్ని అందించబడుతుందన్నారు. ప్రస్తుతం వేసవిలో కాలేజీ విద్యార్థులకు పరీక్షల సమయం, అనంతరం విద్యాసంస్థలకు సెలవులు ఉండటంతో రక్తము కొరత తీవ్రంగా ఉందని, వీరికి రక్తము దొరకకపోతే మృతి ఒడిలోకి చేరుతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్, ఎస్సీ ఎస్టీ ఆఫీసర్స్ అసోసియేషన్ ద్వారా మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించి తలసేమియా సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.



## ఆదివాసీ యువత చెడు

# వ్యసనాలకు దూరంగా ఉండాలి

- ఆదివాసీల అభివృద్ధే లక్ష్యం
- ఆదివాసీ యువత చదువుపై దృష్టి సారించాలి
- మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు
- సంఘ విద్రోహ శక్తులకు ఆశ్రయం ఇవ్వద్దు..
- సమస్యలు ఉంటే పోలీసులకు తెలియజేయాలి
- ఆదివాసీల ఆత్మీయ సమ్మేళనంలో ఎస్పీ అఖిల్ మహాజన్



**ఉట్నూర్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
జిల్లాలోని ఆదివాసీ యువత చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని, వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. మంగళవారం ఉట్నూర్ మండలంలోని కేబీ కాంప్లెక్స్ పీఎంఆర్సీ భవనంలో ఆదివాసీలతో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసులకు సంబంధించిన తొమ్మిది తెగల నాయకులు, పెద్దలు, రాయి సెంటర్ నిర్వాహకులు, నాయకులు ఈ ఆదివాసీ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గతంలో పనిచేసిన పోలీసు ఉన్నతాధికారులందరూ ఆదిలాబాద్ జిల్లా ప్రాముఖ్యతను, విశిష్టతను తెలియజేశారని, ఆదివాసీల సంస్కృతి, సాంప్రదాయాలు ప్రత్యేక గుర్తింపుని కలిగి ఉన్నాయని అన్నారు. అవి తనకెంతో ఇష్టమని పేర్కొన్నారు. ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకుంటూ ప్రజలు ఉన్నత లక్ష్యాలను సాధించాలని కోరారు. తమ 9 తెగల సంస్కృతి, సాంప్రదాయాలను ప్రపంచ వ్యాప్తంగా తెలియజేసే విధంగా ఎదగాలని కోరారు. ఆదివాసీ నాయకులు తెలిపిన సమస్యలను తనకు సాధ్యమైనంత వరకు పరిష్కరించే దిశగా కృషి చేస్తానని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి జాబ్ మేళా నిర్వహిస్తామని చెప్పారు. చట్టాలపై అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామాన పోలీసులు కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం నేరమని, యువతకు లైసెన్స్ మేళా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆదివాసులు గంజాయి మాదకద్రవ్యాల బారిన పడకుండా, దళారుల ద్వారా మోసపోకుండా ప్రత్యేక చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ జిల్లా పోలీసు యంత్రాంగం తమకు ఎంతగానో సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. అనంతరం జిల్లా ఎస్పీని పలువురు నాయకులు శాలువాతో సత్కరించారు. తదుపరి ఆదివాసీ నాయకులతో కలిసి సామూహిక భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, తుడుం దెబ్బ రాష్ట్ర నాయకుడు గోడం గణేష్, జిల్లా మేడి మెస్రం దుర్గు పటేల్, మెస్రం మనోహర్, కెస్లాపూర్ ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకటరావు, ఆదివాసీ సార్ మేడిలు, పటేల్, 9 తెగల నాయకులు, పెద్దలు, ఉట్నూర్ సీఐ జి.మొగిలి, జైనథ్ సీఐ డి.సాయినాథ్, రూరల్ సీఐ కె.ఫణిదర్, ఎస్సైలు మనోహర్, సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

## బాస్కెట్ బాల్ రాష్ట్ర అసోసియేషన్‌లో జిల్లా వాసులు



**మంచిర్యాల, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
హైదరాబాద్ గచ్చిబౌలిలోని హోటల్ క్లేరియన్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఎన్నికల్లో జిల్లాకు చెందిన ఇద్దరు ఎన్నికయ్యారు. రిటర్నింగ్ అధికారిగా హైకోర్ట్ జస్టిస్ నవీన్ రావు వ్యవహరించగా రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి 10 జిల్లాల నుంచి 20 మంది పోటీపడ్డారు. జిల్లాకు చెందిన చంద్రమోహన్ గౌడ్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా గెలుపొందగా, రాష్ట్ర అసోసియేట్ సెక్రటరీగా సుకుమార్ ఫ్రాన్సిస్ విజయం సాధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రోజులలో గ్రామీణ ప్రాంతాలలో సైతం బాస్కెట్ బాల్ గేమ్ అభివృద్ధికి దోహదపడు తామన్నారు. తమ గెలుపుకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, సెక్రటరీ పృద్వీశ్వర్ రెడ్డిలతో పాటు జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చంద్రమోహన్



తెలంగాణ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఎన్నికలు మంగళవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో గల హోటల్ క్లేరియన్‌లో నిర్వహించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా హైకోర్టు జడ్జి పి.నవీన్ రావు వ్యవహరించారు. ఉమ్మడి జిల్లా నుంచి 20 మంది ఓటర్లు పాల్గొనగా మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన చంద్రమోహన్ గౌడ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర అసోసియేట్ సెక్రెటరీగా సుకుమార్ ఫ్రాన్సిస్ గెలుపొందారు.

## నేడు భైంసాలో ఫిర్యాదుల స్వీకరణ

**ముథోల్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
ఈ నెల 2న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల భైంసా క్యాంపు ఆఫీస్‌లో ఫిర్యాదు దారులకు అందుబాటులో ఉంటారు.

# శ్రీరాంపూర్ 92 శాతం బొగ్గు ఉత్పత్తి




**శ్రీరాంపూర్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
సింగరేణి సంస్థ 2024-25 ఆర్థిక సంవత్సరానికి శ్రీరాంపూర్ ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యంలో 92 శాతం సాధించినట్లు ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ తెలిపారు. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. 2024, ఏప్రిల్ 1 నుంచి 2025, మార్చి 31 వరకు ఏరియా మొత్తానికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం 63.1 లక్షల టన్నులకు 57.86 లక్షల టన్నులు సాధించినట్లు వివరించారు. కేవలం మార్చి నెలలో నిర్దేశించిన ఉత్పత్తిలో 147 శాతం ఉత్పత్తిని సాధించినట్లు తెలిపారు. ఉత్పత్తి లక్ష్యాల సాధనకు కృషి చేసిన ఉద్యోగులు, సూపర్వైజర్లు, అధికారులకు అభినందనలు తెలిపారు.

### అధికారులతో సమీక్ష..

ఏరియా అధికారులతో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రక్షణ చర్యలపై సమీక్ష నిర్వహించారు. గత సంవత్సరం జరిగిన బొగ్గు రవాణా, ఇతర రికార్డులపై చర్చించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏ విధంగా ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలో అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం యన్.సత్యనారాయణ, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి ఏవీ.రెడ్డి, టి.శ్రీనివాస్, ఏజెంట్లు రాజేందర్, వెంకటేశ్వర్లు, శ్రీధర్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేశ్ బాబు, ప్రాజెక్ట్ ఇంజినీర్లు రామకృష్ణారావు, నాగరాజు, సర్వే అధికారి నర్సింగరావు, పర్యావరణ అధికారి హనుమాన్ గౌడ్ పాల్గొన్నారు.

# విద్యార్థులపై పోలీసుల నిర్బంధం ఆపాలి



**నిర్మల్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
ప్రజాఉద్యమాలు, విద్యార్థుల పోరాటాలపై పోలీసు నిర్బంధాన్ని వెంటనే ఆపాలని సీపీఎం జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల రక్షణకు చేపట్టిన విద్యార్థుల పోరాటం అణచివేత, ఎస్ఎఫ్ఎస్ఐ విద్యార్థి నాయకులపై జరుగుతున్న అక్రమ నిర్బంధాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం నూతన్ కుమార్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాఉద్యమాలను అణచివేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ భూముల అమ్మకం ద్వారా అధికారం నిలుపుకొనే యత్నాన్ని ప్రజ లు సహించరని హెచ్చరించారు. 400 ఎకరాల హెచ్సీయూ భూమిని విక్రయించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని పేర్కొన్నారు. అక్రమంగా అరెస్ట్ చేసిన విద్యార్థులు, సీపీఎం నాయకత్వాన్ని విడుదల చేయాలని, విద్యార్థులపై పెట్టిన కేసులు తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నియంతృత్వ ధోరణిని ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని కోరారు. ఫసీ ఉద్దీన్, పోశెట్టి, డాకూరు తిరుపతి తదితరులున్నారు.



## వనం నుంచి.. జనంలోకి..

# చుక్కల దుప్పి

**ఖానాపూర్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
అటవీ ప్రాంతంలో నీరు లేకపోవడంతో జనావాసాల్లోకి వచ్చిన చుక్కల దుప్పిని అటవీ అధికారులు పట్టుకున్నారు. సోమవారం సాయంత్రం కుక్కలు వెంబడించడంతో దుప్పి ఓ నివాసంలో చొరబడి అందులోనే ఉండిపోయింది. దీంతో మంగళవారం విద్యానగర్లోని ఓ నివాసంలో దుప్పిని గమనించిన స్థానికులు అటవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఎఫ్ఎస్ఏ రవీందర్, ఎఫ్బీవో ముత్యం అక్కడికి చేరుకుని పట్టుకునే ప్రయత్నం చేశారు. తప్పించుకున్న దుప్పి పలువురి నివాసాల్లోకి చొరబడింది. ఎట్టకేలకూ అరగంట సేపటికి ఓ ఇంట్లో బందించారు. కళ్లకు గంతలు, కాళ్లకు తాళ్లతో కట్టి బంధించారు. అటవీ శాఖ జీపులో అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**సారంగాపూర్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**



రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు మండలం లోని వంజర్ గ్రామానికి చెందిన చాకపురం లచ్చన్న (72), చందాల రమేశ్, లక్ష్మణ్ మంగళవారం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కుక్కలు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. లచ్చన్న, రమేశ్కు తీవ్ర గాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. ఈఎంటీ సాగర్, పైలట్ మహేష్ క్షతగాత్రులను నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ లచ్చన్న మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



# మధురమైన మధుశాల

ఈ మధ్య కాలంలో గ్రామీణ ప్రాంతాలు చిన్న సినిమాల కథలకు కేరాఫ్ అడ్రెస్ గా మారిపోయాయి. ఒక మంచి కథను పట్టుకుని .. ఒక మంచి పల్లెటూరిని లొకేషన్ గా మార్చుకోవడం ఎక్కువగా కనిపిస్తుంది. తక్కువ బడ్జెట్ లో మంచి కంటెంట్ ఉన్న సినిమాలను అందించడానికి అవసరమైన వనరులుగా ఇప్పుడు పల్లెటూళ్లు కనిపిస్తున్నాయి. అలా రూపొందిన 'మధుశాల' .. 'ఈటీవీ విన్'లో స్ట్రీమింగ్ అవుతోంది.

## కథ:

అది ఒక మారుమూల గ్రామం .. ఎమ్మెల్యే సత్యనారాయణ (గోపరాజు రమణ) అధికారం అక్కడ కొనసాగుతూ ఉంటుంది. ఆయనపై పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థిగా వెంకట్రావ్ (బెనర్జీ) కూడా అదే ఊళ్లో ఉంటాడు. సత్యనారాయణ తన కొడుకు ప్రేమించాడని చెప్పి .. పేదింటి అమ్మాయి పల్లవి (యానీ)ని కోడలిగా తీసుకుని వస్తాడు. ఆయన ఆదర్శాన్ని గురించి అందరూ కూడా గొప్పగా చెప్పుకుంటూ ఉంటారు. పల్లవి తల్లిదండ్రులు తమ అదృష్టానికి మురిసిపోతారు. అదే గ్రామంలో దుర్గ ( మనోజ్ నందం) కష్టాన్ని నమ్ముకుని బ్రతుకుతూ ఉంటాడు. రాములు (తనికెళ్ల భరణి) కూతురు 'కనక' (ఇనయా)ను అతను ప్రేమిస్తూ ఉంటాడు. ఇద్దరూ కూడా పెళ్లి చేసుకోవాలనే ఆలోచనలో ఉంటారు. ఇక ఆ గ్రామానికే అందగత్తెగా అందరూ 'మధురవాణి' (వరలక్ష్మి శరత్ కుమార్) పేరు చెబుతూ ఉంటారు. ఎలాగైనా ఆమెను పొందాలనే ఉద్దేశంతో రవి (గెటప్ శ్రీను) ఆమె ఇంటి చుట్టూ తిరుగుతుంటాడు. ఈ నేపథ్యంలోనే పల్లవిని కిడ్నాప్ చేసి ఓ నాలుగు రాజుల పాటు రహస్యంగా ఉంచమని నాయుడమ్మ (రఘుబాబు) చెప్పడంతో 'దుర్గ' అలాగే చేస్తాడు. దాంతో పల్లవి కోసం వెతుకులాట మొదలవడంతో ఊళ్లో వాతావరణం అంతా కూడా గందరగోళంగా మారిపోతుంది. ఆ సమయంలోనే పల్లవిని చంపేయమనే ఆదేశం దుర్గకి అందుతుంది. అప్పుడు అతను ఏం చేస్తాడు? పల్లవిని చంపించడానికి ఎవరు ప్రయత్నిస్తున్నారు? మధురవాణి పాత్ర ఏమిటి? అనేది మిగతా కథ.

## విశ్లేషణ:

గ్రామీణ ప్రాంతాలలో సహజంగానే స్థానిక రాజకీయాలపై దృష్టి ఎక్కువగా ఉంటుంది. అక్కడ రాజకీయనాయకుల అనుచర గణాలుగా .. వర్గాలుగా ప్రజలు విడిపోవడం కనిపిస్తూ ఉంటుంది. అలాగే 'ఈజీ మనీ' కోసం పల్లెటూరి కుర్రాళ్లు ఇబ్బందుల్లో పడటం గురించిన కథనాలను కూడా వింటూనే ఉంటాము. ఇక గ్రామాల పరిధి చాలా తక్కువగా ఉంటుంది గనుక, అక్కడ ఒకరిని ఒకరు గమనించడం తేలిక. అలాంటి అంశాలను కలుపుకుంటూ తయారు చేసిన కథ ఇది. ప్రేమ .. రాజకీయాలు .. కాస్తంత కామెడీ మిక్స్ చేసిన విలేజ్ కథలు చాలా వరకూ ఆకట్టుకునే మాదిరిగానే అనిపిస్తూ ఉంటాయి. అలా ఈ కథ ఆకట్టుకుందా? అంటే లేదనే చెప్పాలి. పల్లవిని కోడలిగా చేసుకునే తొలి సన్నివేశమే తేలిపోతుంది. స్క్రిప్ట్ పై చిత్రీకరణపై సరైన కసరత్తు జరగలేదనే విషయం అప్పుడే అర్థమైపోతుంది. ఒక వ్యక్తిని మర్డర్ చేయాలంటూ ఆ వ్యక్తికి సంబంధించిన ఫొటో చేతులు మారడం చూస్తే, సిటీ బస్సులో కండక్టర్ నుంచి ప్యాసింజర్ వరకూ టికెట్ చేతులు మారడం గుర్తొస్తుంది. ప్రధానమైన కథలో ఎమ్మెల్యే .. మధురవాణి .. దుర్గా పాత్రలు ముఖ్యమైనవిగా కనిపిస్తాయి. అయితే ఈ మూడు పాత్రలను పవర్ఫుల్ గా మలచలేకపోయారు. ముఖ్యంగా 'మధురవాణి' పాత్రను సరిగ్గా డిజైన్ చేయకపోవడం వలన ఆ పాత్ర డీలాపడిపోతుంది. రఘుబాబు తనికెళ్ల భరణి పాత్రలు సిల్లీ కామెడీకి పరిమితం కావడం ఇబ్బంది పెడుతుంది. సినిమా ఆరంభంలో 'మధుశాల' అనే వైన్ షాపును చూపిస్తారు. మిగతా కథనంతా వదిలేసి ఆ వైన్ షాపు పేరును సినిమాకి టైటిల్ గా సెట్ చేయడం ఆశ్చర్యం.

## పనితీరు:

ఈ సినిమాలో కాస్త క్రేజ్ ఉన్న ఆర్టిస్టులే ఉన్నారు. అయితే వారి పాత్రలను సరిగ్గా డిజైన్ చేయకపోవడం వలన, సహజత్వం లోపించింది. ఏ ట్రాక్ వైపు నుంచి కూడా ఫీల్ తో కూడిన సీన్స్ ను ప్లాన్ చేసుకోలేపోయారు. అందువలన పేలవమైన సన్నివేశాలతో కథ చివరి వరకూ సాగుతుంది. ఫొటోగ్రఫీ ..నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ పనితీరు ఓ మాదిరిగా అనిపిస్తాయంతే.




# హిట్-3 నుంచి పోస్టర్ రిలీజ్

నేచురల్ స్టార్ నాని, శైలేష్ కొలను కాంబోలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'హిట్3' . హిట్ ఫ్రాంచైజీలో రాబోతున్న ఈ మూవీపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి అనడంలో అతిశయోక్తి లేదు. అంతే కాకుండా.. ఇప్పటికే ఇందులో నుంచి ప్రతి అప్‌డేట్ కూడా అంచనాలకు మించి ఉండటంతో.. ఈ చిత్రం కోసం ఫ్యాన్స్ ఎంతో ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా 'హిట్3' నుంచి లేటెస్ట్‌గా ఓ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. 'వైల్డ్ రైడ్ కు ముందు ఎప్పుడూ ఫైర్ ఉంటుంది. మాస్ నేచురల్ స్టార్.. మాస్ రప్పా రప్పా మే 1న రాబోతుంది' అంటూ రిలీజ్ చేసిన కౌంట్ డౌన్ పోస్టర్ లో నాని ఊరమాస్ లుక్ లో దర్శనమిచ్చి ఫ్యాన్స్ కు ఫుల్ కిక్ ఇస్తున్నాడు.


దీపికా పిల్లి

# కథ వినకుండానే ఓకే చెప్పాను

యాంకర్ ప్రదీప్ మాచిరాజు, జబర్దస్త్ ఫేమ్ దీపికా పిల్లి కాంబినేషన్‌లో వస్తున్న మూవీ 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' . నితిన్, భరత్ కలిసి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మాంక్స్ అండ్ మంకీస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఇందులో సత్య, గెటప్ శ్రీను, మురళీధర్ గౌడ్, జాన్ విజయ్ జీఎమ్ సుందర్, రోహిణి, ఝాన్సీ తదితరులు ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన అప్‌డేట్స్ ఆకట్టుకోగా.. పాజిటివ్ ఎక్స్ పెక్టేషన్స్ మధ్య ఈ మూవీ ఏప్రిల్ 11న థియేటర్‌లలో సందడి చేయనుంది. ఈ క్రమంలోనే ప్రమోషన్స్‌లో జోరు పెంచిన చిత్ర బృందం.. తాజాగా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ ట్రైలర్ ఫుల్ కామెడీ ఎంటర్ టైనింగ్ గా ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో దీపిక పిల్లి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. 'నేను ఇందులో రాజకుమారి అనే పాత్రలో కనిపిస్తాను. అసలు ఫస్ట్ నాకు వీళ్లు కథ చెప్పలేదు. అయితే ఇంతకు ముందు నేను వీళ్లతో వర్క్ చేశాను. నితిన్, భరత్, ప్రదీప్ వీళ్లందరితో నాకు మంచి ఫ్రెండ్‌షిప్ ఉన్నది. సో నాకు కథ చెప్పకుండా ఇలా సినిమా తీద్దాం అనుకుంటున్నాము అనగానే నేను చాలా ఎగ్జైట్ అయ్యాను. వెంటనే ఓకే చెప్పేశాను. ఆ తర్వాత షూట్ కి ఇంకా వారం ఉంది అనగా అప్పుడు నాకు నెరేషన్ ఇచ్చి ఇది నీ పాత్ర ఇలా చెయ్యాలి అని చెప్పారు. నాకు వీళ్లతో వర్క్ చెయ్యడానికి భయం కూడా అనిపించలేదు. నేను సెట్‌లో ఒక్క దాన్నే అమ్మాయిని.. వీళ్లు నన్ను చాలా బాగా చూసుకునే వారు' అంటూ తెలిపింది.


శోభితా ధూళిపాళ్ల

# బంపర్ ఆఫర్ కొట్టేసిన శోభితా

నటి శోభితా ధూళిపాళ్ల బంపరాఫర్ కొట్టినట్లు తెలుస్తుంది. పెళ్లికి ముందు బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్ సినిమాలతో బిజీగా ఉన్న ఈ భామ నాగచైతన్యతో పెళ్లి అనంతరం కొద్దిరోజులు సినిమాలకు దూరంగా ఉంటుంది. అయితే ఇప్పుడు మళ్లీ సినీ రంగంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది ఈ భామ. తమిళ ప్రముఖ దర్శకుడు పా.రంజిత్ ఒక సినిమాను తెరకెక్కించబోతుండగా.. ఈ సినిమాలో హీరోయిన్‌గా శోభితా ధూళిపాళ్లకు అవకాశం దక్కినట్లు తెలుస్తుంది. తమిళ అగ్ర దర్శకుడిలలో రంజిత్ ఒక్కడు. అట్టకత్తి మద్రాస్, కబాలి, కాలా, సర్పాట్ట పరంబరై, తంగలాన్ చిత్రాలతో తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ని సంపాదించుకున్నాడు రంజిత్. అయితే తంగలాన్ తర్వాత రంజిత్ వెట్టువం అనే ఒక ప్రాజెక్ట్‌ను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో దినేశ్ హీరోగా నటించబోతుండగా.. ఆర్య విలన్ పాత్రలో నటించనున్నాడు. అట్టకత్తి చిత్రం తరువాత వీరి కాంబోలో వస్తున్న రెండో సినిమా ఇది. అయితే ఈ సినిమాలోనే శోభితా ధూళిపాళ్లను హీరోయిన్‌గా తీసుకుంటున్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే శోభితకు ఇది మంచి అవకాశం అని చెప్పవచ్చు.

# దమ్ముంటే నా సినిమాను బ్యాన్ చేయండి



టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత నాగవంశీ నిర్మాణంలో వచ్చిన తాజా చిత్రం మ్యాడ్ స్క్వేర్. సూపర్ హిట్ చిత్రం మ్యాడ్ సినిమాకు సీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రం ఉగాది కానుకగా మార్చి 28న ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఈ మూవీ టికెట్ రేట్లు ఎక్కువగా ఉన్నాయని.. సినిమా బాగాలేకున్న మేకర్స్ ఫేక్ కలెక్షన్లు చూపిస్తున్నారని కామెంట్లు వస్తున్నాయి. పలు వెబ్‌సైట్‌లలో ఈ సినిమాకు నెగిటివ్ రివ్యూలు వచ్చాయి. దీంతో తాజాగా ప్రెస్ మీట్ పెట్టిన నాగవంశీ.. మీడియా జర్నలిస్ట్‌లతో పాటు రివ్యూలు ఇచ్చే పలు వెబ్‌సైట్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆ సినిమాకు తక్కువ కలెక్షన్లు వచ్చాయని అంటున్నారు. వారికి నేను సమాధానం చెప్పాలి అనుకుంటున్నా. ఎవరికి తక్కువ కలెక్షన్లు వచ్చాయి అనిపిస్తుందో నా దగ్గరికి రండి వారికి అసలు కలెక్షన్లు చూపిస్తాను. ఇదేమైన పెద్దహీరో సినిమానా కలెక్షన్లు రాకున్న బయట హౌస్‌ఫుల్ బోర్డ్ పెట్టడానికి.. నాకు అలాంటి అవసరం కూడా లేదు. సినిమా ఆడుతున్నప్పుడు.. ఎందుకు సపోర్ట్ చేయడం లేదు. ఎందుకు నెగిటివ్ రివ్యూలు రాస్తున్నారు. నా మీద అంత పగ ఉంటే దమ్ముంటే నా సినిమాలు బ్యాన్ చేసి చూపించండి. నా సినిమా ఆర్టికల్స్ రాయకండి. నా దగ్గర యాడ్ తీసుకోకండి. అప్పుడు నేను కూడా చూపిస్తాను నా సినిమాను ఎలా ప్రమోట్ చేసుకోవాలో' అంటూ నాగవంశీ మండిపడ్డారు.

# రైతు వేదికలో జన్మదిన వేడుకలు

**రైతు వేదికలు రైతుల సమావేశానికా..? లేదా నాయకుల పుట్టినరోజు వేడుకల కోసమా? అంటూ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారిన ఓ నాయకుడి పుట్టినరోజు వేడుక**

**కుభీర్, ఎప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
రైతుల సమస్యల పరిష్కారం కోసం.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షల నిధులు మంజూరు చేసి రైతు వేదికలను నిర్మించింది. ప్రభుత్వం సదుద్దేశ్యంతో నిర్మించిన రైతు వేదికలను కొంత మంది నాయకులు తమన సొంత పనులకు వాడుకుంటున్నారు. మండలంలోని పార్డి (బి) గ్రామ రైతు వేదికలో ఓ నాయకుడి జన్మదిన వేడుకలు జరుపుకోవడంపై పలు విమర్శలకు తావిస్తోంది. జన్మదిన వేడుకలు జరుపుకున్న ఫొటో బయటకు రావడంతో మంగళవారం ఉదయం నుండి సోషల్ మీడియాలో ఈ సంఘటన వైరల్‌గా మారింది. రైతు వేదికలు రైతుల కోసమా..? ప్రజా ప్రతినిధుల పుట్టినరోజు వేడుకల కోసమా..? అంటూ సోషల్ మీడియాలో మండలవాసులు విమర్శల వర్షం కురిపిస్తున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసిన వారు పట్టించుకోకపోవడం పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి అధికారులకు తెలియకుండానే రైతు వేదికలో పుట్టినరోజు వేడుకలు ఎలా జరుపుకుంటారని బహిరంగంగానే పలువురు అధికారులపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులు స్పందించి సంబంధిత నాయకులుపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.





## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### ఎమ్మెల్సీ దండే విఠల్

**కాగజ్‌నగర్, ఎప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. కాగజ్ నగర్ పట్టణంలోని ఇందిరా మార్కెట్‌లోని రేషన్ షాపు వద్ద అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లతో కలిసి లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, సన్నబియ్యం పంపిణీ ద్వారా పేదలకు మరింత లబ్ధి చేకూరుతుందని అన్నారు. ప్రతి లబ్ధిదారుడు సన్న బియ్యం వాడుకోవాలని దళారులకు అమ్ముకోకూడదన్నారు. తహసీల్దార్ కిరణ్ కుమార్, మాజీ జడ్పి చైర్మన్ సిడం గణపతి, నాయకులు షబ్బీర్, శరత్, తుడూరు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## తిర్యాణిలో ఎడ్లబండ్ల పోటీలు



**తిర్యాణి, ఎప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
తిర్యాని మండలంలో ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం ఎద్దుల బండి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో కొమురంభీం జిల్లాతో పాటు మంచిర్యాల, చెన్నూర్, మందమర్రి నుండి హౌత్సహికులు పాల్గొన్నారు. ఈ పోటీలలో మంచిర్యాల జిల్లాకు చెందిన మోత్కూరి శ్రీనివాస్, శ్రీకాంత్ రాజశేఖర్ ల ఎద్దుల బండ్లకు ప్రథమ, ద్వతీయ, తృతీయ బహుమతులు లభించాయి. విజేతలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు బుద్ధే విజయ్ బహుమతులు ప్రధానం చేశారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**కడెం, ఎప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా కడెం మండలంలోని కన్నాపూర్ గ్రామంలోని చౌక ధరల దుకాణం -1లో తెల్లరేషన్ కార్డుదారులకు ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ మంగళవారం సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెల్లరేషన్ కార్డు గల కుటుంబాలకు పౌష్టికమైన ఆహారాన్ని అందించాలనే సదుద్దేశంతో సన్న బియ్యం పథకానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పడిగేల భూషణ్, మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పొద్దుటూరి సతీష్ రెడ్డి, రమేష్ రావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## సన్న బియ్యం పంపిణీ ప్రారంభం



**తాండూర్, ఎప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
తాండూర్ మండలంలో మంగళవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండి ఈసా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సురేంద్ర శంకర్, రాష్ట్ర ఎఫ్సీఐ మెంబర్ పులగం తిరుపతి, యూత్ జనరల్ సెక్రటరీ జుబేర్, మాజీ జెడ్పిటిసి బానయ్య, మాజీ గ్రంథాలయ చైర్మన్ సల్వాజి మహేందర్ రావు, కంపెల చిన్నయ్య, చాంద్ పాషా, విలాస్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ డాక్టర్ శంకర్, మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు డాక్టర్ సత్యం, ముసుగసాగర్, మంథని శివకృష్ణ, మల్లేష్, రఘు, దుర్గ మహేందర్, శేఖర్, విలాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సన్న బియ్యం పంపిణీ పథకం దేశానికే ఆదర్శం



**దండేపల్లి, ఎప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీ యావత్ దేశానికే ఆదర్శమని రాజీవ్ గాంధీ పంచాయితిరాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి అన్నారు మంగళవారం కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆదేశానుసారం దండేపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో రేషన్ షాపులలో సన్న బియ్యం పథకం అమలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గడ్డం త్రిమూర్తి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం అమలు పథకాన్ని దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ఎన్నికలలో ఇచ్చిన హామీలే కాకుండా అనేక సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతుందని కొనియాడారు. మంచిర్యాల నియోజకవర్గంలో శాసనసభ్యులు ప్రేమ్‌సాగర్ రావు పాలన దక్షితతో రాష్ట్రంలోనే మంచిర్యాల నియోజకవర్గం మొదటి స్థానంలో నిలుస్తుందన్నారు. సన్న బియ్యం పథకం నిరుపేదల కళ్ళలో ఆనందం నింపిందని అన్నారు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు, పౌరసరాపరల శాఖ మంత్రి ఉత్తంకుమార్‌కి ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావుకు దండేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ తరఫున ధన్యవాదాలు తెలిపారు. గ్రామ గ్రామాన ప్రజలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం ఇన్‌చార్జీలుగా లక్షెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్ చాంద్ తాజా మాజీ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ పార్టీ మండల అధ్యక్షులు అక్కల వెంకటేశ్వర్లు తాజా మాజీ ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్ మాజీ ఎంపీపీ జాబు కాంతారావు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గాండ్ల విజయ్ కట్కూరి రాజన్నలు ఉండగా ఈ కార్యక్రమంలో దండేపల్లి మండలం తాజా మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమష్టి కృషితోనే వార్షిక ఉత్పత్తి సాధన



**రెబ్బెన, ఎప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
అధికారులు, ఉద్యోగుల సమష్టిగా కృషితోనే 2024-25 ఆర్థిక సంవత్సరంలో కైరిగూడ ఓసీపీకి నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని సాధించగలిగామని బెల్లంపల్లి ఏరియా ఇన్చార్జి జీఎం మచ్చగిరి నరేందర్ అన్నారు. కై రిగూడ ఓసీపీ వందశాతం ఉత్పత్తి సాధించిన నేపథ్యంలో మంగళవా రం ఉద్యోగులను అభినందించారు. సింగరేణి యాజమాన్యం మార్చిలో కై రి గూడ ఓసీపీకి 4.70 లక్షల టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించగా 5.43 లక్షల టన్నులతో 116 శాతం ఉత్పత్తి సాధించడం వెనక ప్రతీ ఉద్యోగి పాత్ర ఉందన్నారు. ఏరియాకు తలమానికంగా నిలుస్తున్న కైరిగూడ ఓసీపీని రానున్న రోజుల్లోనూ ఇదే స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఇంజినీర్ వీరన్న, మేనేజర్ శంకర్, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, పర్సనల్ అధికారి రజనీ పాల్గొన్నారు.

## వైద్యులను నియమించాలి



**మంచిర్యాల, ఎప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అత్యవసర వైద్య అధికారులు లేక ప్రత్యేక నిపుణులు, అధ్యాపకులను డీఎంఈ ఆదేశాల మేరకు సాధారణ అత్యవసర వైద్య బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో అత్యవసర వైద్యాధికారులను నియమించాలని ఆసుపత్రి వైద్యులు డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య నిపుణులు, అధ్యాపకులుగా పనిచేస్తున్న వారు మంగళవారం ఆసుపత్రి ఎదుట నిరసన చేపట్టారు. అత్యవసర విభాగాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు, అధ్యాపకులపై పనిభారం తగ్గించేందుకు వారి నియామకం తక్షణమే చేపట్టాలన్నారు. వైద్య నిపుణులపై అత్యవసర వైద్య బాధ్యతలను పెంచడంతోఅసలు విభాగాల్లో సేవల నాణ్యత తగ్గిపో తుందని, ఫ్యాకల్టీ సభ్యుల్లో నిరసన పెరిగి, కొత్తగా వచ్చే వారు ఆసక్తి చూపించడం లేదన్నారు. క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లుగా తమకు విధులు అప్పగించవద్దని కోరారు.

## జాతర పోస్టర్ల ఆవిష్కరణ

**బెజ్జూర్, ఎప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేట మండల కేంద్రంలో మహంకాళి జాతర పోస్టర్లను మంగళ వారం మాజీ సర్పంచ్ ఉపాస సంజీవ్ కుమార్ ఆధ్వర్యంలో హనుమాన్ భక్తులు ఆవిష్కరించారు. 12న రెబ్బెన మండలం ఇందిరానగర్‌లో మహంకాళి అమ్మవారి పుట్టిన రోజు వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇంద్రానగర్‌లో వెలిసిన స్వయంభూ మహంకాళి అమ్మవారి జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## చెక్ బౌన్స్ కేసులో జైలు

**చెన్నూర్, ఎప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
చెక్ బౌన్స్ కేసులో ఆలం సత్తయ్య బుద్దారం గ్రామస్తుడికి రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 10 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని మంచిర్యాల జిల్లా చెన్నూరు కోర్టు మేజిస్ట్రేట్ రవికుమార్ తీర్పునిచ్చారు. కిష్టంపేట గ్రామానికి చెందిన బొమ్మ శ్రీనివాస్ రెడ్డి వద్ద తన అవసరనిమిత్తం డబ్బులు తీసుకుని చెల్లించకపోవడంతో కోర్టును ఆశ్రయించడంతో కేసు పూర్వపరాలను పరిశీలించి సెక్షన్ 138 ఎన్ఐ ఆక్ట్ ప్రకారం నేరం రుజువు కావడంతో ముద్దాయికి శిక్షతో పాటు జరిమానా విధించారు.

## సెల్‌ఫోన్ దొంగ రిమాండ్

**ఆదిలాబాద్, ఎప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**
సెల్‌ఫోన్ దొంగిలించిన వ్యక్తిని రిమాండ్ చేసినట్లు వన్టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. రెండు రోజుల క్రితం పట్టణంలోని అంబేద్కర్ చౌక్ సమీపంలో గల రేణుక హోటల్లో పనిచేసే వినోద్ సెల్‌ఫోన్‌ను మహారాష్ట్రలోని కిన్వట్‌కు చెందిన జాదవ్ ప్రవీణ్ దొంగిలించాడు. మంగళవారం వినాయక్ చౌక్ ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులు జాదవ్ ప్రవీణ్‌ను పట్టుకున్నారు.



## ఎన్నికల్లో ఇచ్చిన సంక్షేమ పథకాలన్నింటినీ
# ప్రభుత్వం అమలు చేయాలి

- సన్నబియ్యం పంపిణీ చేయడం అభినందనీయం
- రైతులందరికీ రుణ మాఫీ చేయాలి
- సన్న బియ్యం పంపిణీని ప్రారంభించిన ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

**ముథోల్, ఎప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేయడం అభినందనీయమని అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇతర సంక్షేమ పథకాలను పేదలకు అందించాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. మంగళవారం బైంసా పట్టణంలోని అనసూయ పవార్ నగర్ సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నారాయణరావు పటేల్‌తో కలిసి ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ ఒక్క రైతుకు రైతు భరోసా ఇవ్వాలన్నారు. అదే విధంగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, లబ్ది దారులకు తులం బంగారం పంపిణీ చేయాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పేద ప్రజల పెన్నిధి అని దశరవారీగా ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నారని మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ అన్నారు. మిగతా వాటిని నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పేదలు సైతం పెద్దల మాదిరిగానే సన్న బియ్యం తినాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ అనంతరావు, అధికారులు పాల్గొన్నారు.

### సన్న బియ్యం కార్యక్రమానికి హాజరుకాని తహశీల్దార్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్నబియ్యం ప్రారంభోత్సవం కార్యక్రమానికి మంగళవారం ముధోల్ మండలంలోని తరోడ గ్రామంలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్,బైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావ్ పటేల్ ప్రారంబించారు. అయితే ముధోల్ తహశీల్దార్ శ్రీకాంత్ సన్న బియ్యం ప్రారంభోత్సవం కార్యక్రమానికి హాజరు కాకపోవటం చర్చనీయాంశంగా మారింది. గ్రామంలో చాలా మందికి రేషన్ కార్డులు రాలేదని గ్రామస్థులు చెప్పారు. దీంతో ఈ విషయం తహశీల్దార్ కు చెప్పుదామని అనుకుంటే హాజరు కాకపోవటం పై పలువురు మండి పడ్డారు. తహశీల్దార్ హాజరు కాకపోవటం పై తో మండల ఆర్ఐలు నారాయణ రావు పటేల్, సరస్వతి హాజరు అయ్యారు. దీంతో అర్హులైన తమకు రేషన్ కార్డులు రాలేదని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆర్ఐతో విచారణ జరిపి అర్హులకు రేషన్ కార్డులు వచ్చేటట్లు చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. దీంతో వారు శాంతించారు. తహశీల్దార్ కార్యక్రమానికి ఎందుకు రాలేదని ఆర్ఐని ఎమ్మెల్యే ప్రశ్నించారు. వ్యక్తిగత పనులు ఉండటం వల్ల తహశీల్దార్ రాలేక పోయారని ఆర్ఐ చెప్పారు. ఆయా మండలంలో సన్న బియ్యం ప్రారంభోత్సవం కార్యక్రమంకు తహశీల్దార్ లు హాజరు అయినప్పటికి ప్రభుత్వ కార్యక్రమానికి తహశీల్దార్ హాజరు కాకపోవడం విమర్శలకు దారితీసింది.





## భారతీయ కిసాన్ సంఘ్
# ఆవిర్భావ దినోత్సవం

**దండేపల్లి, ఎప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

భారత్ కిసాన్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం దండేపల్లి మండల కేంద్రంలో కిసాన్ సంఘాన్ని ప్రారంబించారు ఈ కార్యక్రమానికిభారతీయ కిసాన్ సంఘ్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ముఖ్య అతిథిగా గుంటక సత్యనారాయణ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ ప్రైవేటు సంస్థలలో పనిచేసే ఉద్యోగులకు చివరకు మునిసిపల్ సఫాయి కార్మికులకు కూడా సంఘాలు ఉన్నాయని వాటి ద్వారా ఆయా ఉద్యోగులు తమ హక్కులను సాధించుకుంటున్నారని ప్రపంచానికి ఆకలి తీరుస్తున్న రైతన్న జీవితం ఎక్కడ వేసిన గొంగళి అక్కడ లాగానే ఉందని రైతులకు కూడా ఒక బలమైన సంఘం ఉంటేనే భవిష్యత్తులో వ్యవసాయ రంగం నిలదొక్కుకుంటుందని లేనిపక్షం లో ఆహార ధాన్యాల కొరత ఏర్పడడం లేదా ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు కొనలేని స్థితికి దిగజారడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వంలో పంటకాలువల నిర్వహణను చేయక కాలువలన్నీ చెట్టు చేమలతో, మట్టి దిబ్బలతో నిండిపోయాయి నీటి వృధా ఎక్కువగా జరిగి కడెం ఆయకట్టు మొత్తానికి నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని దీనిపై తక్షణమే స్పందించి ఎండిపోతున్న పంటలను కాపాడే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వాలు రైతులను ఓటు బ్యాంకుగా వినియోగించుకోవడం మాని రైతులకు కావలసిన నాణ్యమైన విద్యుత్తు ధాన్యం కొనుగోలు సెంటర్లు ఏర్పాటు పంట మార్పిడి విధానం ఎఫ్.పి.ఓ సెంటర్‌లను ఏర్పాటు చేసి వాటి ద్వారా రైతులకు తక్కువ ధరలకు ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు వ్యవసాయ పరికరాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో కిసాన్ సంఘ్ నాయకులు తిరుపతి, వెంకటేశ్వర్లు, రాకేష్, హరీష్, సంతోష్, రవీందర్, రాజన్న పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతీ లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ







- సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, ఎప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా తెల్ల రేషన్ కార్డు కలిగిన అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ మండలంలో 3217005, 3217012 నంబర్లు గల చౌక ధరల దుకాణాలలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావుతో కలిసి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేదవారి కడుపు నిండా అన్నం పెట్టాలని ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. రేషన్ కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారుడికి సన్నబియ్యం చేరాలన్న చారిత్రాత్మక పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, సంబంధిత అధికారుల సమన్వయంతో ప్రతి లబ్ధిదారుడికి సన్న బియ్యం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌక ధరల దుకాణాల నిర్వాహకులు, అధికారులు పాల్గొన్నారు.

# బెట్టింగ్‌లకు యువత దూరంగా ఉండండి

### కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు



**ఆసిఫాబాద్, ఎప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

యువత, విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్, నిషేధిత ప్లే కార్డ్స్, గేమింగ్ యాప్‌లకు, ఐపీఎల్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తక్కువ సమయంలో సులభంగా ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చన్న భ్రమలో యువత, ప్రజలు విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్, గేమింగ్ యాప్స్ లకు బానిసలుగా మారి, అప్పులపాలపై ప్రాణాలకు మీదకు తెచ్చుకుంటున్నారని, అన్నారు. ఆన్లైన్ బెట్టింగ్, ప్లే కార్డ్, గేమ్స్ కట్టడికి జిల్లా పోలీస్ శాఖ ఆధునిక సాంకేతికతను వినియోగించుకొని ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అలాగే ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్స్ వల్ల యువత ఆర్థికంగా దెబ్బతిని చివరికి సూసైడ్ చేసుకొని ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని, బెట్టింగ్‌లకు యువత దూరంగా ఉండాలని తెలిపారు. ఐపీఎల్ బెట్టింగ్ నిర్వహించే వారిపై పోలీస్ నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ పేర్కొన్నారు. ఇంట్లో తల్లిదండ్రులు తమ పిల్లల పై ప్రవర్తన పై నిఘా పెట్టాలని, ప్రతి రోజూ పిల్లలు వారు చేస్తున్న పనుల గురించి ఆరా తీయాలని తెలిపారు. క్రికెట్ బెట్టింగ్, ప్లేయింగ్ కార్డ్స్, బెట్టింగ్ యాప్స్, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల నిర్వహకుల మార్గదర్శకంలోనే బెట్టింగ్‌లు ఆపరేట్ చేయబడతాయని, బెట్టింగ్ యాప్ లలో డబ్బులు పెట్టుబ డిగా పెట్టి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఎస్పీ సూచించారు. బెట్టింగ్ యాప్‌ల డౌన్‌లోడ్ ద్వారా ప్రజల వ్యక్తి గత సమాచా రం, అకౌంట్ వివరాలు, సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్ళే అవకాశం ఉన్నందని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు, యువత అప్రమత్తంగా ఉండి, బెట్టింగ్ సంబంధిత సమాచారాన్ని పోలీసులకు అందజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

# ఆర్థిక సాయం అందజేత

**దండేపల్లి, ఎప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

దండేపల్లి మండలం రాజుగూడ గ్రామపంచాయతీ జైతుగూడకు చెందిన బోయిడి లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, తాళ్లపేట మాజీ ఎంపీటీసీ కంది సతీష్ కుమార్ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి, మృతురాలి కుటుంబ సభ్యుడు కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కన్నయ్యకు రూ.4వేలను అందజేవారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతు ఆపదలో ఉన్నా ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కన్నక జంగు, మాజీ సర్పంచ్ కాంతారావు, చంద్రయ్య, రవీందర్, రాజన్న, బట్టు రాజన్న, భీమయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



# సన్న బియ్యం పంపిణీ చరిత్రలో నిలిచిపోయే పథకం





- పేదల ఆనందమే ప్రభుత్వ లక్ష్యం
- పేదల ఆకలి తీర్చడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం
- సన్న బియ్యంతో పేదింట్లో సంతోషం
- పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి
- ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే
- ఖానాపూర్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఖానాపూర్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

సన్న బియ్యం పథకం నిరుపేదల ఆత్మగౌరవ పథకమని, చరిత్రలో నిలిచిపోయే పథకమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ప్రజలకు అందిస్తున్న, సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం ఖానాపూర్ పట్టణంలోని దుకాణం 1లో లబ్ధిదారులకు ఉచిత సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజా ప్రభుత్వం ప్రతి పేద వాడికి సంక్షేమ పథకాల ఫలాలు పూర్తిస్థాయిలో అందించడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని, ప్రజలకు సన్న బియ్యం పథకం శ్రీకారం చుట్టారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం, రాజేందర్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ లు పడిగల భూషణ్, మజీద్, నాయకులు నయీమ్, తాసిల్దార్ సుజాత రెడ్డి తదితరులు ఉన్నారు.

**ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే..**

మండల కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం అర్ధరాత్రి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆకస్మికంగా సందర్శించి,తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని వార్డుల్లో తిరుగుతూ చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. ఓ రోగి ఆరోగ్యం కొంత విషమంగా ఉండటంతో వెంటనే మెరుగైన వైద్యం కోసం ఆ రోగిని అంబులెన్స్ ద్వారా ఆదిలాబాద్ జిల్లా రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా డాక్టర్లతో మాట్లాడి రోగుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. ఆస్పత్రిలో అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా డాక్టర్లు, సిబ్బంది చూసుకోవాలన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలను అందించాలని డాక్టర్లకు సూచించారు. ఎప్పటికప్పుడు రోగులను పరిశీలిస్తూ ఉండాలని అలసత్వం వహించకుండా తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖాడే ఉత్తం ఉన్నారు.

## మండుటెండలో పాదరక్షలు లేకుండా పాదయాత్ర

### పౌరాదేవి దర్శనానికి బయలుదేరిన సేవాలాల్ మహరాజ్ భక్తులు



**ఆదిలాబాద్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

బంజారాల ఆరాధ్యదైవం పౌరదేవి దివ్యదర్శనానికి వేలాదిగా సేవాలాల్ భక్తులు పాదయాత్రగా బయలుదేరారు. నెల రోజుల పాటు భక్తులు కఠోర దీక్ష చేపట్టిన భక్తులు నార్నూర్ మండలంలోని దీక్ష భూమి కొత్తపల్లి నుండి దీక్ష గురుప్రేమ్ సింగ్ మహారాజ్ నేతృత్వంలో ఉగాది రోజున పాదయాత్రను ప్రారంభించారు. 200 కిలోమీటర్ల దూరంలోని మహారాష్ట్రలోని వాసిం జిల్లాలో పౌరదేవి వరకు మండుటెండలో సైతం పాదరక్షలు లేకుండా పాదయాత్రగా చేరుకుంటారు. మంగళవారం జిల్లా కేంద్రానికి చేరుకున్న పాదయాత్ర భక్తులకు ఎమ్మెల్యే అనిల్ యాదవ్ అన్న దానం చేపట్టారు. ఆదిలాబాద్‌లో బసచేసి భక్తులు బుధవారం పాదయాత్రను ప్రారంభిస్తారు.

# సీపీ ఆధ్వర్యంలో మంచిర్యాలలో కార్డెన్ సెర్చ్

- రాత్రి 10.30 సమయంలో ఆకస్మికంగా తనిఖీ చేసిన సీపీ అంబర్ కిషోర్ ఝా
- సీపీ వెంట డీసీపీ, ఏసీపీ, సీఐ, ఎస్సైలు..

**మంచిర్యాల, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్‌లో మంగళవారం రాత్రి 10.30 గంటలకు డిసిపి ఎగ్గడి భాస్కర్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తిలక్ నగర్ లోని ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. ఇండ్లు, ఇంటి పరిసరాలతో పాటు వాహనాలను పరిశీలించారు. వాహనాలకు ఆర్సి, తదితర సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆకస్మికంగా కార్డెన్ సెర్చ్ లో పాల్గొన్నారు. అనుమానాస్పదంగా ఉన్న ఇండ్లలో తనిఖీలు నిర్వహించారు. కాలనీవాసులను భద్రత పరమైన విషయాలపై అడిగి తెలుసుకున్నారు. పోలీసుల పనితీరుపై ఆరా తీశారు. అనంతరం కాలనీలోని యువతను ఉద్దేశించి మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దని, సరైన ధ్రువీకరణ పత్రాలతో వాహనాలను నడపాలని, కాలనీకి అనుమానాస్పదంగా ఎవరైనా వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పోలీస్ సిబ్బంది కార్డెన్ సెర్చ్‌లో మంచిర్యాల ఏసిపి ప్రకాష్, సీఐలు ప్రమోద్ రావు(మంచిర్యాల టౌన్), ఆకుల అశోక్ (మంచిర్యాల రూరల్), నరేందర్ (లక్షెట్టిపేట), వేణు చందర్ (శ్రీరాంపూర్), ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# అర్హులందరికీ సన్నబియ్యం పంపిణీ

## కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**



అర్హులందరికీ సన్నబియ్యం పంపిణీ చేస్తామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్‌తో కలిసి అన్ని మండలాల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సన్న బియ్యం పంపిణీకి తీసు కోవాల్సిన చర్యలపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హత గల ప్రతీ లబ్ధిదారుడికి సన్న బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని రేషన్ దుకాణాల వద్ద పండుగ వాతావరణంలో ఎంపీలు, ఎమ్మెల్యేలతో పంపిణీ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. అలాగే ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. బియ్యం నిల్వలను దృష్టిలో ఉంచుకుని పంపిణీ ప్రక్రియ చేపట్టాలన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.

## తెలుగు ప్రజల ప్రాచీన నృత్యం కూచిపూడి

### ఏక కాలంలో 400 కళాకారుల నృత్యాలు



**మందమర్రి, ఏప్రిల్ 1 (ప్రభాత సమాచారం)**

ఏకకాలంలో 400 మంది కళాకారులు కూచిపూడి నృత్యం చేసి కళా వైభవాన్ని చాటారు. జిల్లా కేంద్రంలోని పద్మావతి గార్డెన్‌లో టాలెంట్ కల్చరల్ ఆర్ట్స్, సమిష్టి చేయూత వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కూచిపూడి కళావైభవం పేరిట లార్జెస్ట్ కూచి పూడి డ్యాన్స్ ప్రదర్శించారు. తొమ్మిది నిమిషాల పాటు కళాకారులు నృత్యం చేస్తూ అలరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు మాట్లాడారు. కళలను ప్రోత్సహించి ప్రేరణ కల్గించాల్సిన అవసరం ఉందని అన్నారు. టాలెంట్ కల్చరల్ ఆర్ట్స్ గౌరవ అధ్యక్షులు, సలహాదారులు ఉదారి చంద్రమోహన్ గౌడ్, దుర్గం రాజేష్ నేతకాని మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలోనే కళలను ప్రోత్సహించే సంఘాలుండాలని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ యాదవ సంఘము మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నల్వల సమ్మయ్య యాదవ్, జనసేన పార్టీ మంథని ఇంచార్జి మాయ రమేష్‌లు మాట్లాడుతూ... కూచిపూడి నృత్యం తెలుగువారికి ఎంతో ఇష్టమైందని అన్నారు. మంచిర్యాలలో కూచిపూడి నృత్యరూపకం తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ లోకి ఎక్కడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టాలెంట్ కల్చరల్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు సునార్కర్ రాంబాబు నేతకాని ఆనందం వ్యక్తం చేశారు. గురువు కేంద్ర సంగీత సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వేదాంతం రామలింగ శాస్త్రి, నాట్య విశారద మాచిరాజు రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో కళాకారులు ఏకకాలంలో నృత్యం చేసి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ రికార్డ్స్ లోకి ఎక్కారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ రికార్డ్స్ నిర్వాహకులకు సర్టిఫికెట్ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి నృత్య గురువులు, టాలెంట్ కల్చరల్ ఆర్ట్స్ సలహాదారులు మడ్డి వేణుగోపాల్ గౌడ్, ఉపాధ్యక్షులు గడ్డం మానస, కార్యదర్శి సాయిలు తదితరులు పాల్గొన్నారు.